RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri
CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 303 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: శనివారం 06-06-2026 పేజీలు : 12 వెల: 1-00

## అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

### అమ్మమ్మతో పాటు ఇద్దరు మనవళ్ల మృతి

**నల్లగొండ, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నల్లగొండ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. మిర్యాలగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. మరణించిన వారిని అమ్మమ్మ వనం చంద్రకళ, మనుమడు లక్ష్మణ్ (16), మనమరాలు ప్రణతి (14) గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యభర్తలు. చంద్రకళ భర్త అనారోగ్యంతో కొన్ని రోజుల కిందటే మరణించాడు. ఇక చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్ (16), ప్రణతి (14)తో పుట్టింట్లోనే ఉంటోంది. ఉపాధి నిమిత్తం ఇళ్లలో పనిచేసేందుకు ధనమ్మ మూడు రోజుల కిందట పుణెళికు వెళ్లింది. ఇదిలా ఉంటే.. గురువారం రాత్రి మనుమడు, మనుమరాలితో చంద్రకళ తమ రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. విద్యుద్ఘాతం కారణంగా ఇంట్లో పెద్ద ఎత్తున మిగతా 2లో..



# నీటి ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ కోట్ల దోపిడీ

- కమీషన్లు దండుకుని ఒక్క ఎకరాకు నీరు అందించలే
- కెసిఆర్ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ చేపట్టలేదు
- కమిషన్ల కోసం కాళేశ్వరం చేపట్టినా..కూలింది
- ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టుల్లో పెండింగే
- పామూరు ఎంపిగా ఉన్నా జిల్లాకు కెసిఆర్ చేసింది శూన్యం
- జిల్లా ప్రాజెక్టులను యుద్ద ప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రెండో రోజు జిల్లాలో పర్యటించిన సిఎం రేవంత్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల కమిషన్లు కొల్లగొట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కమిషన్లు దండుకొని ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని ఆగ్రహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి రెండోరోజు పర్యటించారు. బీఆర్ఎస్ హయాంలో కమిషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను సందర్శిస్తున్న సీఎం.. రెండోరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో జూరాల మినహా అన్ని ప్రాజెక్టులూ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి మిగతా 2లో..

# యధాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

### ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ... రెపోరేటును యథాతథంగా కొనసాగిస్తూ నిర్ణయం
### ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి




**ముంబై, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా మిగతా 2లో..

# తిరుమలలో మొక్క నాటిన కేంద్రమంత్రి

### శ్రీవారిని దర్శించుకున్న పీయూష్ గోయల్



**తిరుమల, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనం అద్భుతంగా జరిగిందన్నారు. ప్రతి ఏటా జూన్ మాసంలో పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్నట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు తన తల్లి పేరిట తిరుమలలో మొక్క నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు నేడు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చిన్న పిల్లలు కూడా తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్నారు. తిరుమలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ అద్భుతంగా ఉందని కేంద్ర మంత్రి కొనియాడారు. దర్శన గణంకాలతో పాటు తిరుమలలో టీటీడీ భక్తులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను ఇక్కడి నుంచే పర్యవేక్షించడం అద్భుతమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి మిగతా 2లో..

# పర్యావరణంతో సంబంధం లేదని అనలేం


### పరిరక్షణ బాధ్యత అందరిదీ అని గుర్తించాలి
### కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం




**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని మిగతా 2లో..

# హైడ్రా భారీ ఆపరేషన్..

### 200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్



**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. ప్రభుత్వ స్థలం చుట్టూ హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు. రూ.30వేల కోట్ల విలువైన భూమిని కాపాడినట్లు హైడ్రా తెలిపింది. పుప్పాలగూడ భూముల్లో చారిత్రక రాతి గుట్టలు ఉన్నాయి. ఈ భూములను గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. చారిత్రక గుట్టలను కాపాడాలని కోరుతూ సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు దశాబ్దాలుగా మిగతా 2లో..

# భాజపాకు అన్నామలై గుడ్‌బై

### రాజీనామాకు ఆమోదం



**న్యూఢిల్లీ, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తమిళనాడులో రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ఈ రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ శుక్రవారం ఆమోదించారు. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అన్నామలై ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'తమిళగ మక్కల్ కళగం' లేదా 'తమిళగ మక్కల్ కట్చి' అనే పేరుతో పార్టీని స్థాపించే మిగతా 2లో..

# హైదరాబాద్‌లో ఎబోలా కలవరం


### ఇప్పటికే గాంధీలో ఇద్దరికి చికిత్సలు




**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్‌లో ఎబోలా అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులను రాత్రి సమయంలో అపోలో ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ విభాగంలో వారికి చికిత్స అందిస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న వైద్య బృందం అవసరమైన పరీక్షలు నిర్వహిస్తోంది. రోగుల ప్రయాణ వివరాలు, వైద్య చరిత్ర, సంప్రదించిన వ్యక్తుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. పరిస్థితిని ఆరోగ్య శాఖ మిగతా 2లో..

# భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

### తమిళనాడు కాంచీపురంలో అరెస్ట్...హైదరాబాద్‌కు తరలింపు
### వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు



**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చ నున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకాల దుర్వినియోగం తోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ మిగతా 2లో..

# మేం అధికారంలో ఉన్నప్పుడు పేపర్ లీక్‌లు జరగలేదే?

### ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** దేశంలో తరచూ తలెత్తుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## అర్ధరాత్రి ఇంట్లో పేలిన సిలిండర్

మంటలు చెలరేగాయి. ఇది గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా.. భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే సజీవదహనం అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మృతదేహాలను వెలికితీశారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. పూర్తిగా కాలిన మృతదేహాలను స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

## తిరుమలలో మొక్క నాటిన కేంద్రమంత్రి



లోకేశ్ ఆదేశాలతో అత్యాధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను 100 రోజుల్లోనే టీటీడీ ఏర్పాటు చేయడం హర్షణీయమని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈరోజు(శుక్రవారం) ఉదయం కేంద్ర మంత్రి తిరుమల శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామి ఎవారిని దర్శించుకున్నారు.

## పర్యావరణంతో సంబంధం లేదని అనలేం

కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## హైడ్రా భారీ ఆపరేషన్..

పోరాడుతున్నారు. గతంలో హైకోర్టును కూడా ఆశ్రయించారు. రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని రక్షించాలని ఉన్నత న్యాయస్థానం మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం కావడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషయాన్ని సొసైటీ టు సేవ్ రాక్స్ ప్రతినిధులు ఇటీవల హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా సిబ్బంది ఫెన్సింగ్ వేశారు

## భాజపాకు అన్నామలై గుడ్‌బై

అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన 'వియ్ లీడర్స్' అనే ట్రస్టును నిర్వహిస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి రాజకీయ ఉద్యమంగా మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్న అన్నామలై.. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి, మోదీ పాలన స్ఫూర్తితో 2020లో భాజపాలో చేరారు. అప్పటినుంచి తమిళనాడులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. పాదయాత్ర చేసి పార్టీ విస్తరణకు కృషి చేశారు. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాజపా.. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనిపై అన్నామలై అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడం, ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడం రాజీనామాకు కారణమైనట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## భూకబ్జా కుట్రదారుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

## హైదరాబాద్‌లో ఎబోలా కలవరం

అధికారులు పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే.. కాంగోలో ఎబోలా మహమ్మారి వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర స్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ మహమ్మారి వ్యాప్తిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఎందుకంటే, ఇది అత్యంత అరుదైన వైరస్ రకానికి చెందినది. దీనికి ఎలాంటి టీకా లేదు. డీఆర్ కాంగోలో అంతర్గత సంఘర్షణలు నెలకొన్న ప్రాంతంలో ఈ కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ మహమ్మారి వ్యాప్తి ఊహించినదానికంటే వేగంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది.

# నీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ కోట్ల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. పంపులు, లిఫ్ట్ పనుల్లో అవినీతిపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారు. జిల్లా నలుమూలలా తిరిగి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని అన్నారు. . మేం పనులు చేపడుతుంటే వాళ్లు రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారు. సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేశా. పనులు పరిశీలించి భవిష్యత్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం అని అన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని మండిపడ్డారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించాం. కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసి పట్టుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాక పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేస్తారనుకున్నాం. ప్రాజెక్టుల గురించి ప్రశ్నిస్తే అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే 26 లక్షల ఎకరాలకు ఆయకట్టు వచ్చేది. రూ.27వేల కోట్లు ఖర్చు చేసి పంపులు, లిఫ్ట్ పనులు పూర్తిచేశారు. ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది. కమీషన్ల పేరిట రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా జరగలేదు. కానీ.. ప్రాజెక్టులు పూర్తయినట్లు కేసీఆర్ ఎలా భావించారని అన్నారు. మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల కోసం రూ.22వేల కోట్లు ఖర్చు చేశాం. వీటిలో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఇచ్చాం. ఈ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావాలంటే 4వేల ఎకరాల భూసేకరణ చేయాలి. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చేయకుండా రిజర్వాయర్లలో నీళ్లు నింపగలమా?రెండేళ్లలో పనులు పూర్తిచేయాలని కంకణం కట్టుకుని ముందుకెళ్తున్నాం. గతంలో విపరీతంగా



అప్పులు తేవడం వల్ల ఇప్పుడు ప్రాజెక్టులకు అప్పులు తెచ్చుకోలేని పరిస్థితి వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.55వేల కోట్ల అంచనా వేసి రూ.27వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 50 శాతం నిధులూ ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులెలా పూర్తవుతాయి? ఉన్నదంతా దోచుకుని మమ్మల్ని దోషులుగా నిలబెడదామనే భ్రమల్లో ఉన్నారు. నాపై కోపంతో మక్తల్-నారాయణపేట -కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ తొక్కిపెట్టారని రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం. భూసేకరణకు రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలో ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. తక్కువ భూసేకరణతో ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకునే ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేస్తాం. కర్ణాటకతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల కోసం అధ్యయనం చేస్తున్నాం. పనులకు అడ్డుపడకుండా ఉండాలని బీఆర్ఎస్ నేతలను కోరుతున్నా. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల లాంటివారు. బీఆర్ఎస్ పార్టీకి, నేతలకు గతమే ఉంది.. భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టయినా మొదలుపెట్టి పూర్తి చేసిందా చెప్పాలి. ప్రాణహిత-చేవెళ్ల పేరు, ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్‌కు తెలుసు. ఆయన సొంతంగా మొదలుపెట్టిన ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదు. కాళేశ్వరం కూలిన తర్వాత చుక్క నీళ్లు తీసుకోకుండా ఎక్కువ వరి ఉత్పత్తి చేశాంఅని రేవంత్ అన్నారు. జిల్లాకు కారు పార్టీ అధినేత తీరని అన్యాయం చేశారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. నీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తోందని.. వారి పాలనలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేశారని రేవంత్ పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరంపైనే రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. అది పూర్తి చేసి ఉంటే 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం ఉండేదన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. వేల కోట్లు పెట్టి కేవలం పంపులు, లిఫ్టులు మాత్రమే నిర్మించారని సీఎం రేవంత్ మండిపడ్డారు. నీటి పారుదల శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పటికీ నగదు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత 30 నెలల్లో రూ.52 వేల కోట్లకు పైగా అసలు, వడ్డీ చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు.తమ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రతి 6 నెలలకోసారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ పర్యటనలో సిఎం వెంట మంత్రలుఉ ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తదితరులు ఉన్నారు.

# యథాతథంగా ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్ఆర్ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

# మేం అధికారంలో ఉన్నప్పుడు పేపర్ లీక్‌లు జరగలేదే?

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. భాజపా అధికారంలోకి రాగానే ఈ లీక్‌లు మొదలయ్యాయని ఆక్షేపించారు. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ ( గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చిందని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని దేశ యువతకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునేలా విద్యార్థులు, పౌరులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానంత వరకు ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. నీట్, సీబీఎస్ఈ పేపర్ వివాదాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

**హన్మకొండ, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించి, రైతులను ప్రోత్సహించాలని పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రజలను కోరారు. హనుమకొండలో పబ్లిక్ గార్డెన్స్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో సేంద్రియ ధాన్యాలు, మి÷-లలెట్స్, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చేనేత వస్త్రాలు తదితర ఉత్పత్తులు (15 స్టాల్స్‌లో) అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు బయ్య సారయ్య తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

## కల్తీ పదార్థాలతో చాక్లెట్ల తయారీ

**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహానగరంలోని కల్తీ చాక్లెట్ల తయారీ గుట్టును హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్ రట్టు చేసింది. సీతారాంబాగ్ ప్రాంతంలో విగ్నెట్ ఫుడ్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై హెచ్ ఫాస్ట్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి కార్తీక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసింది. ఈ సంస్థలో రసాయన పదార్థాలతో కల్తీ చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ అండ్ సేఫ్టీ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో ఈ సంస్థపై సదరు టీమ్ దాడి చేసింది.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**ఖమ్మం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. దీని కోసం నిర్వహించే వనమోత్సవంలో మొక్కలు నాటి నగరాన్ని పచ్చదనంతో నింపాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగించవద్దని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి రాధిక, టీపీబీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌కు దూరంగా ఉందాం

### జూట్ బ్యాగ్‌లు పంచిన న్యాయవాది

**జగిత్యాల, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని కోరుతూ ప్రముఖ న్యాయవాది మధుసూదన్ రెడ్డి కోరారు. రానున్న గోదావరి పుష్కరాల్లోనూ ప్లాస్టిక్‌ను దూరం పెట్టాలన్నారు. ఈ మేరకు ఆయన భక్తులకు 2500 జ్యూట్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. రానున్న గోదావరి పుష్కరాల నాటికి ధర్మపురి పుణ్యక్షేత్రంలో ప్లాస్టిక్ కవర్లు లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు రామయ్య, దేవస్థానం మాజీ ఛైర్మన్ జక్కు రవీందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## 2025-26లో జీడీపీ వృద్ధి 7.7 శాతం

**న్యూఢిల్లీ, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** భారత్ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.1 శాతంగా ఉంది. జనవరి- మార్చి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ మేరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ గణాంకాలను శుక్రవారం వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరలో స్థిర ధరల వద్ద జీడీపీ రూ.229.89 లక్షల కోట్లుగా ఉండగా.. 2025-26 సంవత్సరంలో రూ.323.12 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 2024-25లో రూ. 318.07 లక్షల కోట్లు ఉండగా.. 2025-26లో అది రూ.346.36 లక్షల కోట్లకు చేరుకున్నట్లు పేర్కొంది.

# స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకలాపాలు

### మల్కాజిగికి ప్రాంతంలో ఏకకాలంలో దాడులు

### 113 స్పా సెంటర్లపై పోలీసుల తనిఖీలు

**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పలు స్పా సెంటర్లపై పోలీస్ బృందాలు శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. దాదాపు 500 మంది పోలీసులు.. బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లపై ముకుమ్మడిగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలు స్పా సెంటర్లలో అక్రమాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. కస్టమర్లకు సంబంధించిన డేటా రిజిస్టర్‌ను సైతం స్పా సెంటర్ నిర్వాహకులు మెయింటెయిన్ చేయడం లేదని గుర్తించారు. అలాగే స్పా సెంటర్లకు రెంటుకు ఇస్తున్న ఓనర్లను కూడా ఈ సందర్భంగా పోలీసులు విచారించారు. స్పా సెంటర్ల నుంచి రెంట్ తీసుకోవడం తప్ప.. అందులో ఏం జరుగుతుందో కూడా ఓనర్లు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. కొన్ని స్పా సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి కూడా.. ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు గుర్తించారు. నగరంలోని స్పా సెంటర్ల భారీగా ఉన్నాయి. వీటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ అడపాదడపా పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ఆయా ఫిర్యాదుల మేరకు పోలీసులు దాడులు చేస్తున్నారు. సందర్భంగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కానీ నగరంలో ఒకే సారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేయడం ఇదే ప్రథమం. అలాగే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. పోలీస్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. స్పా ముసుగులో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా.. వీటికి అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

### శోకం మిగిల్చిన ఎల్లమ్మ పండగ వేడుక

### మంజీరాలో ఈతకు వెళ్లి నలుగురు మృత్యువాత

**కామారెడ్డి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది బాన్సువాడ మండలం బుడిమి శివారులోని మంజీరా నది వద్ద ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. వీరిలో భానుప్రసాద్, అనిత, పావని , శివాని నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మంజీరా నదిలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి మృత్యువాత పడ్డారు. బొల్లాక్‌పల్లి సమీపంలోని మంజీరా నదిలో అనిత, పావని, శ్రీవాణి, భాను ఈతకు దిగారు. వీరంతా నదిలో ఊబిలో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన సమీపంలోని ఒక మహిళ వారిని రక్షించే ప్రయత్నం చేసి తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే ఆమెను రక్షించారు. అలాగే ఊబిలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు బొల్లాక్‌పల్లికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం బాన్సువాడ మండలం బుడిమి గ్రామం వద్ద ఎల్లమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుక జరిగింది. అనంతరం భోజనాలు చేసిన తర్వాత నలుగురు చిన్నారులు మంజీరా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లి.. ఊబిలో చిక్కుకుని మరణించారని పోలీసులు చెప్పారు. వీరంతా 10 ఏళ్ల లోపు వారేనని తెలిపారు. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులతోపాటు బంధువుల రోదనలు మిన్నంటాయి.

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో ప్రమాదంలో జలహక్కులు

### సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## నిధులు, నియామకాలు, నీళ్లలో వైఫల్యం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**మహబూబాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

### 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730

**న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ):** భారత్‌లో బంగారం ధరల్లో పతనం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలో శుక్రవారం కూడా స్వల్ప స్థాయిలో కోత పడింది. అయితే, కొన్ని రోజులుగా స్థిరంగా ఉంటున్న వెండి ధర మాత్రం తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,730కు పడిపోయింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధరలో రూ.380ల మేర కోత పడింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.350ల మేర తగ్గి రూ.1,42,750కు చేరుకుంది. ఇక నగరంలో కిలో వెండి ధరలో రూ.5 వేల మేర కోత పడింది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.8 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.350ల మేర తగ్గింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,57,960గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,300గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,730గా, 22 క్యారెట్ల



పసిడి ధర రూ.1,42,750గా ఉంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,55,880గా, 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,42,900గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,444 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 72 డాలర్ల వద్ద కొనసాగుతోంది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల విషయంలో మదుపరులు వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.5,616.56 కోట్లు, గురువారం రూ.4,447.06 కోట్ల నికర విక్రయాలు జరిపారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు పెరిగి రూ.95.74 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒకదశలో 2.5 శాతానికి పైగా తగ్గి 95.33 డాలర్లకు దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.700 పెరిగి రూ.1,60,300 పలకగా.. కిలో వెండి రూ.3,800 తగ్గుదలతో రూ.2,65,700కు దిగివచ్చింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 4,472 డాలర్లు, సిల్వర్ 73.56 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

### శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ



**తిరుపతి,జూన్5(ఆర్ఎన్ఎ):** తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# మాజీ ప్రియురాలి దారుణ హత్య

- కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన దుండగుడు
- అనంతరం అదే కత్తితో పొడుచుకున్న దుర్మార్గుడు
- యువతి మృతి..యువకుడి పరిస్థితి విషమం

**చండీఘడ్,జూన్5(ఆర్ఎన్ఎ):** పంజాబ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ యువతి మాజీ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైంది. మాజీ ప్రియుడు ఆ యువతిని 20 సార్లు కత్తితో పొడిచి చంపాడు. యువతిని చంపిన తర్వాత అదే కత్తితో తనను తాను పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మొహాలికి చెందిన హర్వీందర్ మన్ అలియాస్ హ్యారీ, డింపుల్ మూడేళ్ల క్రితం ఓ కంపెనీలో కలిసి పని చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరి మధ్యా పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల క్రితం ఇద్దరూ కొత్త కంపెనీలో చేరారు. కొత్త కంపెనీలో చేరిన కొంతకాలం వీరి బంధం సజావుగానే సాగింది. తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరూ విడిపోయారు. డింపుల్‌తో విడిపోవటం హ్యారీకి ఇష్టం లేదు. మళ్లీ ఆమెతో ఒక్కడవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. డింపుల్ ఇందుకు ఒప్పుకోవటం లేదు. దీంతో అతడు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. గురువారం డింపుల్ డ్యూటీలో ఉండగా.. రాత్రి 7.40 గంటల ప్రాంతంలో హ్యారీ ఆఫీస్‌కు వచ్చాడు. ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కత్తితో డింపుల్‌ను 20 సార్లు అతి కిరాతకంగా పొడిచాడు. తర్వాత అదే కత్తితో తన గొంతులో 30 సార్లు పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఇద్దరినీ సహోద్యోగులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. డింపుల్‌ను పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధ్రువీకరించారు. హ్యారీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# మమత పార్టీకి మరో షాక్

### బిధ్నానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

**కోల్‌కతా,జూన్5(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు.

# పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

### మల్కాజిగిరి చోరీ కేసులో పట్టివేత

**హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణెలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో రాత్రి సమయంలో చొరబడిన నేపాలీ గ్యాంగ్.. లక్షల రూపాయల విలువైన నగలు, నగదు, ఇతర వస్తువులను అపహరించింది. ఈ చోరీ హైదరాబాద్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. వెంటనే కేసు నమోదు చేసిన మల్కాజిగిరి పోలీసులు.. సీసీటీవీ ఫుటేజ్‌లు, సెల్‌ఫోన్ లొకేషన్ డేటా ఆధారంగా గ్యాంగ్‌ను ట్రాక్ చేశారు. నేపాలీ ముఠా దేశంలోని వివిధ నగరాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# పాలన చేతగాక పోతే రాజీనామా చేయండి

### ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక లేకుంటే ఎలా... కేంద్రాన్ని తిడుతూ సమస్యలను దాటవేస్తారా... సిఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపి అర్వింద్

**హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ):** పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు. ఇది సిఎంగా ఆయన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. వరికోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు



చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాత్రి భోజనం తర్వాత అరటిపండు తినడం మంచిదేనా!



అరటిపండ్లు ఈ భూమి మీద అత్యంత ప్రాచుర్యం పొందిన పండ్లలో ఒకటి. వీటిని ప్రపంచమంతటా తింటారు మరియు రకరకాల వంటలలో ఉపయోగిస్తారు. రాత్రిపూట అరటిపండు తినడాన్ని నిరుత్సాహపరిచే కొన్ని ఔషధ పద్ధతులు ఉన్నాయి. అనారోగ్యాన్ని ప్రేరేపించడానికి ఇది గొప్ప మార్గం అని కొందరు నమ్ముతారు.అది నిజమా అబద్దమా చూద్దాం. రాత్రిపూట అరటిపండ్లు తినడం గురించి సహజంగా తప్పు లేదా అసురక్షితంగా ఏమీ లేదని పరిశోధనలో తేలింది. మీరు ఖచ్చితంగా నిద్రించడానికి ముందు మీ అద్భుతమైన రుచిని కలిగిన అరటిని తినాలనుకుంటే నిరభ్యంతరంగా మీరు ముందుకు వెళ్లి ఆనందించవచ్చు. కానీ రాత్రిపూట దీనిని నివారించడానికి కారణాలు కూడా ఉన్నాయి. రాత్రిపూట అరటిపండ్లు తినడం వల్ల ముందుగా ఉన్న జలుబు మరియు దగ్గుతో సంబంధం ఉంటుంది, కానీ అరటి ఒక పెద్ద పండు. దీని అర్థం జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. మీరు సాయంత్రం ఒకదాన్ని ఆస్వాదించవలసి వస్తే నిద్రించడానికి కొన్ని గంటల ముందు తప్పకుండా తినవచ్చను నిపుణుల అభిప్రాయం.

**ఆయుర్వేదం ఇదే చెబుతుంది**

ఆయుర్వేదం ప్రకారం, రాత్రి అరటిని తినడం సురక్షితం కాదు. అరటిని రాత్రిపూట తినకూడదు. ఎందుకంటే ఇది దగ్గు మరియు జలుబు కలిగిస్తుంది. జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది.

**పోషకాహార నిపుణులు ఏమి చెబుతారు?**

ఫిట్‌నెస్, న్యూట్రిషన్ నిపుణుడు శశాంక్ రాజన్ ప్రకారం అరటి చాలా ఆరోగ్యకరమైనది మరియు ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. కానీ దగ్గు మరియు జలుబు, ఉబ్బసం లేదా సైనస్‌తో బాధపడేవారు రాత్రి అరటి తినడం మానుకోవాలి. వ్యాయామం తర్వాత అరటి తినడానికి ఉత్తమ మార్గం సాయంత్రం.

**కడుపు ఆమ్లాన్ని నియంత్రిస్తుంది**

అధ్యయనాల ప్రకారం, స్ట్రీట్ ఫుడ్స్ ఎక్కువ ఆహారం తీసుకునే వారికి అరటి మంచి ఎంపిక. రాత్రి అరటిపండు తినడం వల్ల గుండెల్లో మంట, కడుపు పూతల తగ్గుతాయి.

**రాత్రి మంచిగా నిద్ర వస్తుంది**

రోజంతా మీ అలసట తర్వాత అరటిపండు తినడం వల్ల దానిలోని పొటాషియం కండరాల నుండి ఉపశమనం



లభిస్తుంది. మీరు సాయంత్రం ఒకటి లేదా రెండు అరటిపండ్లు తింటే మీకు రాత్రి మంచిగా నిద్ర వస్తుంది. ఒక పెద్ద అరటి పండులో 487 ఎంజి పొటాషియం ఉంది అని శశాంక్ చెప్పారు. పెద్దవారి శరీరానికి పొటాషియం కన్నా ఒక శాతం ఎక్కువ అవసరం. పొటాషియం సుమారు 10 శాతం ఎక్కువ.

**బరువు పెరగరు**

ఒక అరటిలో 105 కేలరీలు మాత్రమే ఉన్నాయి. మీరు విందులో 500 కేలరీల కన్నా తక్కువ కావాలనుకుంటే, మీకు రెండు అరటిపండ్లు మరియు ఒక కప్పు వెన్న తీసిన పాలు తీసుకోవచ్చు.

**కోరికను తొలగిస్తుంది**

మీరు అర్ధరాత్రి డెజర్ట్ తినాలనుకుంటే, మీరు అరటిపండు తినవచ్చు. ఎందుకంటే ఇందులో ఎక్కువ చక్కెర, అధిక కేలరీలు ఉంటాయి. తీపి తినాలనే కోరికను తీర్చడానికి అరటి ఉత్తమం. అదేవిధంగా, శరీరానికి ఎక్కువ విటమిన్లు మరియు ఫైబర్ లభిస్తుంది.

**అనేక వ్యాధులకు అద్భుతమైన సంరక్షణను**

అరటిపండ్లు వివిధ వ్యాధులకు మంచి సంరక్షణ. పురుగు కాటు, దురద, చర్మం ఎర్రబడినప్పుడు అరటి నిమిషాల్లో ఉపశమనం పొందుతుంది. టైప్ -2 డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది, బరువు తగ్గించే ప్రయత్నాలకు దోహదం చేస్తుంది మరియు నాడీ వ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. విటమిన్ బి -6 రక్తంలో తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. మంచి ఐరన్ కంటెంట్ రక్తహీనతతో బాధ పడుతున్నవారిని పోషించడానికి సహాయపడుతుంది.

**ఆహారం నుండి ఇతర పోషకాలను గ్రహించడంలో సహాయపడుతుంది**

అరటిలోని కరిగే ఫైబర్ కడుపులో కరిగి జీర్ణక్రియకు అవసరమైన కొన్ని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు సహాయపడుతుంది. ప్రీబయోటిక్ అని పిలువబడే ఈ దృగ్విషయం, ఇతర ఆహారాల ద్వారా సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఈ బ్యాక్టీరియా సహాయపడుతుంది. జీర్ణక్రియకు సహాయపడే ఇతర ఎంజైమ్‌లను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఈ ఎంజైములు అధిక ప్రోటీన్ చక్కెర ఆహారాలను (ఉదా. మాంసం) జీర్ణం చేయడానికి అవసరం.

**ముగింపు:** అరటిలో చాలా పోషకాలు ఉన్నాయి మరియు ఇది నిద్రించడానికి సహాయపడుతుంది. రాత్రి అరటిని విస్మరించడం మంచిది కాదు. కానీ ఉబ్బసం, సైనస్ మరియు జలుబు ఉన్నవారు రాత్రి అరటిని విస్మరించవచ్చు.

# రోజూ 2 లవంగాలు.. అద్భుతం జరుగుతుంది.. మీకు తెలుసా?



అత్యంత ప్రాచుర్యం పొందిన సుగంధ ద్రవ్యాలలో ఒకటి మొగ్గ ఆకారపు లవంగం. ఇది వంటలో మంచి వాసన, రుచిని ఇస్తుంది. అదనంగా, ఈ పదార్థం అనేక ఔషధ లక్షణాలతో సమృద్ధిగా ఉంటుంది. పంటి నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చని అందులో తెలుసుకున్నాము. ఇది కాకుండా ఇది శరీరంలో చాలా మాయాజాలాలను కలిగిస్తుందని మీకు తెలుసా? రోజూ లవంగం తింటే శరీరానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. లవంగాలు కొద్దిగా ఆల్కలీన్ అయినప్పటికీ, వాటిలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలతో నిండి ఉంటుంది. రోజూ ఇలాంటి లవంగాలని నమలడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో చూద్దాం. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడటానికి మనం తినే ఉత్తమమైన ఆహారాలలో లవంగం ఒకటి. ఎందుకంటే ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచుతాయి. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి కూడా సహాయ పడుతుంది. వాటిలో విటమిన్ సి కూడా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది జీర్ణ సమస్యల నుండి ఉపశమనం పొందటానికి లవంగం పురాతన కాలం నుండి ఉపయోగించబడింది, ఎందుకంటే ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతుంది. లవంగం కూడా వికారం తగ్గిస్తుంది. లవంగంలోలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మలబద్దకాన్ని నివారిస్తుంది. జీర్ణ సమస్యలకు చికిత్స చేయడానికి, మీరు లవంగాన్ని నమలవచ్చు లేదా లవంగా పొడిని తేనెతో కలిపి తినవచ్చు. పంటి నొప్పి నుండి ఉపశమనం లవంగాలలో అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంది. మీకు తీవ్రమైన పంటి నొప్పి ఉంటే, మీరు వైద్యుడి వద్దకు వెళ్ళే వరకు బాధాకరమైన ప్రదేశంలో లవంగం కొరికి పట్టండి. పంటి నొప్పి వల్ల కలిగే అసౌకర్యాలను వదిలించుకోవచ్చు. ఆరోగ్యకరమైన కాలేయం మనం తీసుకునే ఔషధాల జీవక్రియ , నిర్విషీకరణకు కాలేయం కారణం. రోజూ 2 లవంగాలను నమలడం ద్వారా యూజీనాల్ కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది, కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. తలనొప్పిని తగ్గిస్తుంది లవంగాలలోని యూజీనాల్ అనాల్జేసిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను ఇస్తుంది. మీరు తలనొప్పిని అనుభవిస్తే, లవంగం తీసుకొని దాన్ని వదిలించుకోవచ్చు. మీరు లవంగాలు రెండు విధాలుగా ఉపయోగించవచ్చు. మీరు అందులో లవంగాలు తీసుకోవచ్చు లేదా లవంగా నూనెను ప్రభావిత ప్రాంతంపై వేయవచ్చు. మీరు లవంగాలు తింటుంటే, మీరు లవంగా పొడి, రాళ్ళ ఉప్పును ఒక టంబ్లర్ పాలలో కలపవచ్చు, నొప్పి నుండి బయటపడటానికి త్రాగవచ్చు. మీరు దీన్ని సమయోచితంగాఉపయోగించాలనుకుంటే, లవంగాలను కొబ్బరి నూనెలో నానబెట్టి, నుదిటిపై నూనెను మసాజ్ చేయండి. ఎముకలు, కీళ్ళకు మంచిది ఫ్లేవనాయిడ్లు, మాంగనీస్, యూజీనాల్ వంటి తిమ్మిరిలోని కొన్ని పదార్థాలు ఎముక,ఉమ్మడి ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. ఈ పదార్థాలు ఎముక సాంద్రతను పెంచుతాయి.

ఎముక కణజాలం ఏర్పడటానికి, ఆరోగ్యకరమైన ఖనిజాలను ఎముకలకు బదిలీ చేయడానికి సహాయపడతాయి. దుర్వాసనను నివారిస్తుంది ఈ రోజు చాలా మంది ఎదుర్కొంటున్న నోటి సమస్యలలో దుర్వాసన ఒకటి. మీరు ఈ దుర్వాసనను అంతం చేయాలనుకుంటే, రోజూ 2 లవంగాలు తినండి. ఇది యాంటీ బాక్టీరి యల్ లక్షణాలను కలిగి ఉంటుంది,చెడు శ్వాసను కలిగించే బ్యాక్టీరియాను చంపుతుంది.

# 1000 ఏండ్ల నాటి ఆలయం.. ఆ గుడిలో ఒక్క సీన్ తీసినా సినిమా హిట్టే



మన దేశంలో ఉన్న ఒక్కో ఆలయానికి ఒక్క ప్రత్యేకత ఉంటుంది. వాటిలో కొన్ని చారిత్రకంగా గుర్తింపు పొందితే, మరి కొన్ని స్థలపురాణం వల్ల ప్రసిద్ధి పొందాయి. మరికొన్ని ఆలయాలు శిల్పకళ వల్ల గుర్తింపు పొందాయి. కానీ ఓ ఆలయం మాత్రం సినిమా షూటింగులతో చాలా ఫేమస్ అయ్యింది. ఇంతకీ ఆలయం ఎక్కడుంది అనుకుంటున్నారా.. అదేనండి తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న అమ్మపల్లి సీతారామాలయం. ఈ ఆలయం సినిమా షూటింగులు, పెళ్లిళ్లు జరిగే స్పాట్‌గా చాలా పాపులర్ అయ్యింది. ఈ ఆలయం హైదరాబాద్ నుంచి సుమారు 30 కిలోమీటర్లు, శంషాబాద్ బస్‌స్టాప్ నుంచి 5 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఈ గుడిని 13వ శతాబ్దంలో వేంగి రాజులు కట్టించారని పురాణాలు చెబుతున్నాయి. గర్భగుడిలో ఉన్న శ్రీరాముడి విగ్రహం దాదాపు వెయ్యేళ్ల పాతదట. ఈ గుడికి 7 అంతస్తుల గోపురం, గోపురం పై భాగంలో శేషతల్పసాయిగా విరాజిల్లే విష్ణుమూర్తి విగ్రహం, చుట్టూ పెద్ద కారిడార్, మకర తోరణాలు ఇవన్నీ చూడడానికి అద్భుతంగా ఉంటాయంటున్నారు అక్కడికి వెళ్లే భక్తులు. ఇక మరో విషయం ఏంటంటే సాధారణంగా రాములవారి గర్భగుడిలో హనుమంతుడు కూడా ఉంటాడు. కానీ ఇక్కడ మాత్రం హనుమంతుడు గర్భగుడిలో కాకుండా బయట ధ్వజస్తంభం దగ్గర దర్శనమిస్తాడు. ఆలయం చుట్టూ పచ్చని కొబ్బరి తోటలు, పాత కోనేరు ఉంటాయి. మొత్తం గుడి దాదాపు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ సీతమ్మవారు కొలువై ఉండడంతో ఈ ఊరికి అమ్మపల్లి అని పేరు వచ్చిందట. ఇక్కడి రాములు కళ్యాణ రాముడిగా, సీతమ్మవారు సంతాన ప్రసాదినిగా భక్తుల పూజలు అందుకుంటున్నారు. పెళ్లి కావాలనుకునే వాళ్లు, సంతానం కోసం ప్రార్థించే వాళ్లు ఇక్కడికి వచ్చి మొక్కితే చాలు తీరిపోతుందంటున్నారు భక్తులు. ఈ ఆలయంలోని రాముడు కుడి చేతిలో బాణాలు, ఎడమచేతిలో విల్లు పట్టుకుని కోదండ రాముడిగా కనిపిస్తాడు. ఆలయం ముఖమంటపంలో కూర్మం విగ్రహం ఉండడం వల్ల గుడి దర్శనం మోక్షం ఇస్తుందన్న నమ్మకం ఉంది. గరుత్మంతుడు విగ్రహం కూడా ఇక్కడే ఉంటుంది. ఇక ఈ ఆలయంలో మరో విశేషం గురించి చెప్పాలంటే ఇక్కడ షూటింగ్ చేసిన సినిమాలు కచ్చితంగా హిట్టవుతాయన్న నమ్మకం సినిమా వర్గాల్లో బలంగా ఉంది. ముఖ్యంగా 'మురారి' సినిమా ఇక్కడ షూట్ చేసి సూపర్ హిట్ అవడంతో, తర్వాత చాలాసినిమాలు ఇక్కడే కొన్ని సన్నివేశాలు తీశారట. కనీసం ఒక్క సీన్ అయినా ఇక్కడ తీస్తే సినిమా సక్సెస్ అవుతుందన్న నమ్మకం కూడా ఉంది. అలాగే ఇక్కడ వివాహాలు కూడా ఎక్కువగా జరుగుతుంటాయి. ఇక్కడ పెళ్లి చేసుకుంటే పుణ్యం కలుగుతుందని భావిస్తారు. అలా చారిత్రాత్మకంగా, పౌరాణికంగా, సినిమాల వల్ల అన్నీ కలిపి ఈ అమ్మపల్లి సీతారామాలయంకి ఓ ప్రత్యేకమైన స్థానం, గుర్తింపు వచ్చింది.

# అభిజిత్ దిప్కేలను అడ్డుకుంటే అల్లర్లు

### సోషల్ మీడియాలో అమిత్ కుమార్ వీడియో వైరల్

**న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ):** ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపుతోంది. సీజేపీకి మద్దతుదారుడిగా ఉన్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. ఈ వైరల్ వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి నిరసనలో పాల్గొనే వారినుద్దేశించి మాట్లాడుతూ.. 'ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగుతాయి' అని చెప్పినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. నిరసనకారులు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వంటి వాటిని వెంట తెచ్చుకోవాలని సూచించినట్లు ఆ వీడియోలో ఉంది. పోలీసులు నిరసనను అడ్డుకునే అవకాశముందని, ఎలాంటి పరిస్థితులెదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆ వీడియోలోని అత్యంత వివాదాస్పద భాగంలో.. 'ఇప్పటివరకు చాలా భరించాం. ఈసారి హద్దులు దాటుతాం. నేపాల్‌ను నిర్మిస్తాం' అని వ్యాఖ్యానించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈనెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు అనుమతులు కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోపై వివాదం చెలరేగినప్పటికీ.. తమ ఉద్యమం పూర్తిగా శాంతియుతంగానే సాగుతుందని అభిజీత్ దీప్కే అన్నారు. రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా.. జూన్ 6కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. నిరసన కార్యక్రమం శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు, ఉద్యోగ నియామకాల్లో అవకతవకల అంశాలపై చేపట్టిన ప్రచారాలతో.. సీజేపీకి మద్దతు పెరిగింది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్‌సీ జీడీ వంటి పరీక్షలకు సంబంధించిన వివాదాల వల్ల దేశవ్యాప్తంగా సుమారు 95 లక్షల మంది యువత ప్రభావితమయ్యారని ఆ సంస్థ పేర్కొంటోంది.

# ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం

### స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ

**డెహ్రాడూన్,జూన్5(ఆర్ఎన్ఎ):** స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండాపోయింది. బబిత స్నేహితులు ఆమె కోసం వెతికారు. ఆమె ఎక్కడా కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ, ఇండో - టిబెటన్ బోర్డర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 150 మంది ఆమె కోసం వెతుకుతున్నారు.

# రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

- అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు
- 15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు

**హైదరాబాద్ ,జూన్5(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి.నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

**న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ):** దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం. వారిలో 21 మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు కిటికీలు, భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో విదేశీయులే ఎక్కువ మంది ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఆ హోటల్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. దీని ప్రకారం.. ఆ ప్రాపర్టీలో 6 గదులకే అనుమతి ఉండగా.. బేస్‌మెంట్‌లోని కొన్ని గదులతోపాటు మొత్తం 25 గదులతో ఆ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

ఢిల్లీ అగ్నిప్రమాద ఘటన

# హోటల్ యజమాని అరెస్ట్

**న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ):** ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందిన ఘటనలో ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జుడిషియల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం కింద కేసు బుక్ చేశారు. ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎ÷-లోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. ఎ÷-లోరిష్ స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు. ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిశ్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిశ్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు.

# ఎన్‌టిపిసి రామగుండంలో పర్యావరణ దినోత్సవం

**పెద్దపల్లి మే 05 (నేటి మనదేశమ్):** ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యావరణ సుస్థిరత, పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ సంస్థ తమ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సంఘ ప్రతినిధులు, జిఇఎం పిల్లలు, కాంట్రాక్ట్ కార్మికుల చురుకైన భాగస్వామ్యంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026ను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంది. ఈ వేడుకలు 'ప్రభాత ఫేరీ' (పర్యావరణ అవగాహన నడక)తో ప్రారంభమయ్యాయి. దీనిని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రామగుండం, తెలంగాణ) చందన్ కుమార్ సమంత జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర జీవనం, ప్రకృతిని కాపాడటంలో సామూహిక బాధ్యతపై అవగాహన కల్పించడమే ఈ నడక లక్ష్యం. తదనంతరం, పర్యావరణ పరిరక్షణ, వనరుల బాధ్యతాయుత వినియోగం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, పాల్గొన్న వారందరితో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించాలనే ప్రపంచవ్యాప్త నినాదానికి అనుగుణంగా, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి స్థానిక దుకాణదారులకు వస్త్ర సంచులను పంపిణీ



చేశారు. యువతలో పర్యావరణ అవగాహనను, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు, బాలల చిత్రలేఖన పోటీ విజేతలకు బహుమతులు కూడా పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో భాగంగా, టౌన్‌షిప్‌లో సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సంఘ ప్రతినిధులు, బాలల చురుకైన భాగస్వామ్యంతో 200 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం కోల్ భవన్‌లో మరో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ ఉద్యోగులు, తెలంగాణ కార్మికుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో 100 మొక్కలు నాటారు. పర్యావరణ పునరుద్ధరణ పట్ల తమ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, తెలంగాణ యాష్ డైక్ వద్ద అధికారుల సమక్షంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత చేతుల మీదుగా ఒక మియావాకి ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద, దట్టమైన, స్వయంపోషక అడవులను సృష్టించడంలో ప్రసిద్ధి చెందిన మియావాకి పద్ధతిని ఉపయోగించి 1,000 మొక్కలు నాటబడ్డాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాలలో మొత్తంగా 1,300 మొక్కలు నాటబడ్డాయి. ఇది పర్యావరణ పరిరక్షణ పట్ల ఎన్‌టిపిసి రామగుండం, తెలంగాణ అచంచలమైన నిబద్ధతను, మరియు పచ్చని, పరిశుభ్రమైన, మరింత సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించాలనే దాని దార్శనికతను ప్రతిబింబిస్తుంది. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక ఉమ్మడి బాధ్యత అని ఈ వేడుక గుర్తుచేయడమే కాకుండా, రాబోయే తరాల కోసం ప్రకృతిని పరిరక్షించాలనే ఎన్‌టిపిసి సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

## గ్రామాల్లో కామెర్లు, హెపటైటిస్-ఏ పై అవగాహన



**శంకరపట్నం మే 05 నేటి మన దేశమ్:** శంకరపట్నం మండలం రాజాపూర్, కన్నాపూర్, మెట్పల్లి,చింతలపల్లి,మొలంగూరు, మెట్పల్లి, లింగాపూర్ గ్రామాల్లో సిరిసిల్ల వైద్య కళాశాల నిపుణులు డా.జ్యోతి, డా.నిఖిల్, డా.శృతి, డా.మహేశ్వర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు.ఆయా గ్రామాల్లో వ్యాపిస్తున్న కామెర్లు,హెపటైటిస్-ఏ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న మందులను సమయపాలనతో పాటించాలని,వారికి మనోధైర్యాన్ని నింపారు.హుజురాబాద్ డిప్యూటీ డిహెచ్ఎంవో డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ కళ్ళు,చర్మం పసుపు రంగులోకి మారడం,ముదురు రంగు మూత్రం,పొత్తికడుపు నొప్పి,జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే స్థానిక పీహెచ్సీలో వైద్యులను సంప్రదిస్తే మొదటి దశలో వ్యాధులను గుర్తించడంతో వ్యాధులు తగ్గి ముఖం పడతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిల్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శామీర్‌పేట్ సీఐ నరసింహారెడ్డికి వంగ వెంకట్‌రెడ్డి సన్మానం




**శామీర్‌పేట, మే 05 (నేటి మనదేశమ్):** షామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొండ నరసింహారెడ్డిని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు శాఖలో ఆయనకు ఉన్న అనుభవంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. సీఐ నరసింహారెడ్డి ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

## ఈఎస్ఐ డిస్పెన్సరీ అభివృద్ధికి జెనోటెక్ చేయూత




**శామీర్‌పేట, మే 05 (నేటి మనదేశమ్):** సన్ ఫార్మా గ్రూప్‌కు చెందిన జెనోటెక్ లాబొరేటరీస్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా షామీర్‌పేట్ ఈఎస్ఐ డిస్పెన్సరీకి సుమారు రూ.10 లక్షల విలువైన మౌలిక సదుపాయాలను అందజేసింది. క్యాబిన్ పార్టిషన్లు, ప్రధాన గేట్, ఎయిర్ కూలర్లు, ఏసీలు, వాటర్ ప్యూరిఫైయర్లు తదితర సామగ్రిని జెనోటెక్ సీఈఓ డా. సచిన్ గవండారే, హెచ్ఆర్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, కంపెనీ సెక్రటరీ అదుల్ గఫూర్, అడ్మిన్ ప్రతినిధి ఐ. నరసింహారెడ్డి కలిసి ఈఎస్ఐ డిస్పెన్సరీ ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డా. కనకదుర్గాదేవికి అందజేశారు.ఈ సందర్భంగా డా. సచిన్ గవండారే మాట్లాడుతూ ప్రజారోగ్య సేవల బలోపేతానికి తమ సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. అందించిన సదుపాయాలు రోగులు, సిబ్బందికి ఎంతో ఉపయోగపడతాయని డా. కనకదుర్గాదేవి పేర్కొంటూ జెనోటెక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ అధికారులు, వైద్య సిబ్బంది, జెనోటెక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పొలాల్లో పంట అవశేషాలు కాల్చకూడదు : జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్ద్‌పేట జూన్ 05 నేటి మనదేశమ్ ప్రతినిధి** : సిద్దిపేట జిల్లాలో పంట పొలాల్లో పంట అవశేషాలు కాల్చకూడదని, దాని వాళ్ళ అనేక నష్టాలు వస్తాయని జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లాలోని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.జిల్లాలో 3 లక్షల 65 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం, 50 వేల మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేశామని, ఈ పంటలు కోసిన తర్వాత పంట అవశేషాలను (వరి గడ్డి, మొక్కజొన్న కాండాలు, పత్తి కట్టెలు మొదలైనవి) కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు మరియు ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయి. గాలి కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయి. కార్బన్ డైఆక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదల అవుతాయి. నేల సారవంతత తగ్గుతుంది. అక్కడక్కడ రైతులు ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారని దీనికి ప్రత్యామ్నాయా మార్గాలు వెతకాలని అవశేషాలను కంపోస్ట్‌గా మార్చాలని, నేలలో కలిపి సేంద్రియ ఎరువుగా ఉపయోగించడం. పశువుల మేతగా వినియోగించడం. అవశేషాలతో సహా దుక్కి దున్నడం చెయ్యాలని తెలిపారు."పంట అవశేషాలు కాల్చవద్దు -- నేల సారాన్ని కాపాడండి, పర్యావరణాన్ని రక్షించండనీ" జిల్లా రైతాంగానికి పిలుపు నిచ్చారు.

## ఆధారాలు లేని అబద్ధాలు చెప్తే కామారెడ్డి ప్రజలు నమ్మరు - గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై ఇప్ప శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం



**కామారెడ్డ్,జూన్ 05. (నేటి మనదేశమ్ ప్రతినిధి)**ఆధారాలు లేని అబద్ధాలు చెప్తే కామారెడ్డి ప్రజలు నమ్మరు: ఇప్ప శ్రీనివాస్.షబ్బీర్ అలీ పై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన రు 4 కోట్ల లంచం ఆరోపణలను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ సీనియర్ నేత.”సత్యానికి రంగులు పూయలేవు -- అబద్ధాల చంద్రశేఖర్ రెడ్డి పప్పులు ఇకపై కామారెడ్డిలో ఉడకవు! ఇప్ప శ్రీనివాస్.కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మహమ్మద్ అలీ షబ్బీర్ పై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన రు 4 కోట్ల లంచం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి కేవలం రాజకీయ ఉనికి కోసం, పబ్లిసిటీ పిచ్చితో చేసిన పూర్తి అవాస్తవ, నిరాధార, దిగజారుడు ఆరోపణలని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఇప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధారాలు ఎక్కడ?: రు 4 కోట్లు తీసుకున్నారని నోటికొచ్చినట్టు మాట్లాడటం కాదు, దానికి సంబంధించిన ఒక్కటంటే ఒక్క ఆధారం నీ దగ్గర ఉందా? ఉంటే బయటపెట్టు, అంతేకాని గాలిలో దీపాలు పెట్టాలని చూడకు.” అని సవాల్ విసిరారు. అభివృద్ధిపై ఈర్ష్య: మున్సిపాలిటీలో కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని ఓర్వలేక చంద్రశేఖర్ రెడ్డి తన అనుచరులతో కేసులు వేయించిన విషయాలను ప్రజలు మర్చిపోలేదని, కామారెడ్డి అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఈ రకమైన బురదజల్లే రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. వ్యక్తిగత స్వార్థం కోసం నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఇకపై ఊరుకునేది లేదని హెచ్చరించారు. 40 ఏళ్ల నమ్మకం.. గత 40 సంవత్సరాలుగా కామారెడ్డి నియోజకవర్గ మౌలిక వసతుల రూపకల్పనలో షబ్బీర్ అలీ పాత్ర ఎలాంటిదో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో సర్పంచ్‌లను గెలిపించిన ఘనత ఆయనదని, అలాంటి నిష్కళంకమైన నైతికత కలిగిన నాయకుడిపై వేలెత్తి చూపించే స్థాయి, అర్హత చంద్రశేఖర్ రెడ్డికి అస్సలు లేదన్నారు. “రాజకీయాల్లో విమర్శలు ఉండాలి,కానీ అవి వ్యక్తిగత దూషణలుగా, నిరాధారమైన ఆరోపణలుగా మారితే ఇకపై చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.” నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే కామారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు, ఇక్కడి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. చంద్రశేఖర్ రెడ్డి తాను చేసిన అవాస్తవ ఆరోపణలపై వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పి, స్వచ్ఛందంగా రాజకీయాల నుండి తప్పుకుంటే మంచిదని హితవు పలికారు.చంద్రశేఖర్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కామారెడ్డి వ్యాప్తంగా ప్రజల ముందు ఎండగడతామని..పార్టీ క్రమశిక్షణా సంఘం వెంటనే స్పందించి, ఇతనిని కాంగ్రెస్ పార్టీ నుండి శాశ్వతంగా తొలగించాలని ఇప్ప శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యత్వ నమోదు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డ్,జూన్ 05.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తన ఛాంబర్‌లో భారత రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న మానవతా సేవా కార్యక్రమాలను అభినందించారు.రెడ్ క్రాస్ సొసైటీ ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సేవలు , ఇతర సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజ సేవ పట్ల ఆసక్తి ఉన్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు , ప్రజలు జీవితకాల సభ్యత్వం6 పొందాలని ఆయన పిలుపునిచ్చారు.జీవితకాల సభ్యత్వం పొందదలచిన వారు తమ సభ్యత్వ దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు 2026 జూన్ 15వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. ఎక్కువ మంది సభ్యుల భాగస్వామ్యంతో రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించవచ్చని తెలిపారు.

## ఎన్ఎస్పీ భూమి ఆక్రమణపై ఫిర్యాదులు.. స్పందించని అధికారులు

**పేదల గుడిసెల తొలగింపు.. పెద్దల అక్రమ నిర్మాణంపై మౌనం?**



**హుజూర్‌నగర్ మే 05 (నేటి మనదేశమ్):** హుజూర్‌నగర్ సీతారాం నగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వానికి చెందిన ఎన్ఎస్పీ (ఎన్ఎస్పీ) భూమిని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఫిర్యాదు ప్రకారం,సర్వే నంబర్ లేని ప్రభుత్వ స్థలంలో తప్పుడు పత్రాలు,ఇంటి నంబర్ ఆధారంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ స్థలం విలువ సుమారు కోటి రూపాయలకు పైగా ఉంటుందని తెలిపారు.మూడు సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో ఎన్ఎస్పీ కాలువ సమీపంలో పేదలు నిర్మించుకున్న గుడిసెలను తొలగించి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టారని, ప్రస్తుతం అదే ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.ఎన్ఎస్పీ అధికారుల నుంచి ఈ స్థలం పూర్తిగా ఎన్ఎస్పీ పరిధిలోనిదేనని, నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాచారం అందినప్పటికీ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.అదేవిధంగా, నిర్మాణ స్థలం నూతన ఇన్నర్ రింగ్ రోడ్డు మలుపు వద్ద ఉండటంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ ఎన్ఎస్పీ డీఈ, ఆర్ అండ్ బీ డీఈలకు కూడా ఫిర్యాదు పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

## పాలమూరు గడ్డపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు: నిరంజన్ రెడ్డి



**వనపర్తి, మే 05 (నేటి మనదేశమ్):** : ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.35,200 కోట్ల విలువైన పనులు జరిగాయని, రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిన విషయాన్ని సీఎం స్వయంగా అంగీకరించారని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీ గతంలో వ్యతిరేకంగా కేసులు వేసిన విషయాన్ని గుర్తు చేశారు.సాగునీటి ప్రాజెక్టుల కోసం తీసుకున్న అప్పులకు సంబంధించి రూ.52,121 కోట్లు చెల్లించామని ప్రభుత్వం చెబితే, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒక టీఎంసీ నీటితో సాగయ్యే భూవిస్తీర్ణంపై సీఎం చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్వల టెండర్లను రద్దు చేయడం వల్లే అదనంగా వేల కోట్ల రూపాయల భారం పెరిగిందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సాగునీటి ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు.ప్రాజెక్టుల్లో ముందుగా పంపులు, లిఫ్టుల నిర్మాణం చేపట్టడం సహజ ప్రక్రియ అని, వాటిని కమిషన్ల కోసమే నిర్మించారనడం ముఖ్యమంత్రి అవగాహన లేమికి నిదర్శనమని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి పథకానికి అవసరమైన భూసేకరణలో అత్యధిక భాగం బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిందన్నారు.గత 30 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో సాధించిన పురోగతిని చెప్పకుండా పాత ఆరోపణలనే పునరావృతం చేస్తోందని విమర్శించారు. కేంద్రం వెనక్కి పంపిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్ అంశంపై సీఎం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.వలసల జిల్లాగా పేరొందిన పాలమూరులో సాగునీటి వసతులు కల్పించి వ్యవసాయాభివృద్ధికి బాటలు వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని సూచించారు.


## హైదరాబాద్‌లో 'ఆపరేషన్ కవచ్'.. ముమ్మర వాహన తనిఖీలు..



**జూబ్లీహిల్స్ జూన్ 05 (నేటి మనదేశమ్ ప్రతినిధి)** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో గురువారం అర్ధరాత్రి నగరవ్యాప్తంగా నిర్వహించిన “ఆపరేషన్ కవచ్” లో భాగంగా వెంగళరావు నగర్ డివిజన్ కృష్ణ కాంత్ పార్కు వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సీపీ సజ్జనార్‌తో పాటు మధురానగర్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీలలో నంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని, తప్పుడు నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న 42 వాహనాలను సీజ్ చేసారు. వాహనదారులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపినారు. నకిలీ మరియు ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్లను వాడే వారిపై కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన కింద కాకుండా, చీటింగ్ మరియు ఫోర్జరీ కేసులు నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. వాహనదారులు ఎల్లప్పుడూ సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలని, నగర భద్రతకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం గొప్ప సందేశం

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**



**వేములవాడ, జూన్ 05: నేటి మన దేశమ్ ప్రతినిధి** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన “మా కే నామ్ పర్ ఏక్ పేడ్” (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం సమాజానికి గొప్ప సందేశమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు.ప్రధాని మోదీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆయన పిలుపు మేరకు శుక్రవారం అలుగునూర్ పరిధిలోని 133, 134 పోలింగ్ బూత్‌లలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పర్యావరణ సంరక్షణకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని, “అమ్మ పేరుతో ఒక మొక్క” కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం ప్రకృతితో అనుబంధం పెంచుకునే అవకాశం కల్పించిందన్నారు.ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాలు, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ప్రధాని మోదీ దూరదృష్టి కారణంగా భారతదేశం ఆర్థికంగా స్థిరంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినా, దేశ ప్రజలపై భారం తగ్గించే చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు.అలాగే, 80 కోట్లకు పైగా ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తూ పేదల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. “మేక్ ఇన్ ఇండియా” కార్యక్రమం ద్వారా దేశీయ పరిశ్రమలను బలోపేతం చేస్తూ, ప్రపంచ పెట్టుబడులను భారత్ వైపు ఆకర్షిస్తున్నట్లు వివరించారు.ప్రజలు బంగారంపై అధికంగా పెట్టుబడులు పెట్టడం కంటే బ్యాంకులు, ప్రభుత్వ పొదుపు పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ఆయన సూచించారు. పొదుపు అలవాటు కుటుంబ ఆర్థిక భద్రతతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికీ దోహదపడుతుందని చెప్పారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, తెలంగాణలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధికి సామరస్యపూర్వక రాజకీయ వాతావరణం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు చిందం అంజి, నాయకులు కొత్తూరి శ్రీనివాస్, జయంత్, సాయి తదితరులు పాల్గొన్నారు




# దూత మీద నమ్మకం నిర్మాతను చేసింది




హీరోలు నిర్మాతలు కావడం కొత్తేమి కాదు. చిరంజీవి పీక్స్ లో ఉన్నప్పుడే అంజనా ప్రొడక్షన్స్ స్థాపించారు. కార్డు నాగబాబు పేరు మీద కనిపించినా వెనుక ఉన్నది మెగాస్టారన్నది ఓపెన్ సీక్రెట్. ఏఎన్ఆర్ ఉన్నప్పుడే నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ వ్యవహారాలు చూసుకునేవారు. వెంకటేష్ కు నేరుగా కాకపోయినా అన్నయ్య సురేష్ బాబు రూపంలో నిర్మాణం మీద ముందు నుంచి పట్టుంది. బాలకృష్ణ తన తండ్రి బయోపిక్ లో పార్ట్ నర్ గా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటి జనరేషన్ లో ఇలా రిస్కు చేస్తున్న హీరోలు తక్కువే. వాల్ పోస్టర్ బ్యానర్ పెట్టిన మెల్లగా న్యాచురల్ స్టార్ నాని దాని రేంజ్ పెంచే పనిలో ఉన్నాడు. మహేష్ బాబు జిఎంబి పేరు మీద మేజర్ లాంటి ప్రాజెక్టు చేశారు. కిరణ్ అబ్బవరం ఇటీవలే ప్రొడ్యూసర్ రోల్ లోకి వచ్చేశాడు. నాగ శౌర్య లాంటి వాళ్లకు ఫ్యామిలీ బ్యానర్ అండదండలు ఎలాగూ ఉన్నాయి. ఇప్పుడీ లిస్టులో నాగచైతన్య చేరబోతున్నాడు. అమెజాన్ ప్రైమ్ లో మూడేళ్ళ క్రితం వచ్చిన దూత వెబ్ సిరీస్ సీజన్ 2తో నిర్మాతగా కొత్త పాత్రలోకి ప్రవేశించబోతున్నాడు. ఈ మేరకు ఇవాళ పూజా కార్యక్రమాలతో ఓపెనింగ్ చేశారు. గెస్టుగా నాగార్జున కూడా వచ్చారు. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ థ్రిల్లర్ వచ్చే ఏడాది స్ట్రీమింగ్ కు రావొచ్చు. ఎందుకంటే చైతు ప్రస్తుతం వృషకర్మలో బిజీగా ఉన్నాడు. అది రిలీజయ్యాక దూత 2 సెట్స్ లో అడుగు పెట్టొచ్చు. ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా నటిస్తుండగా మొదటి భాగంలో నటించిన కొందరు కీలక ఆర్టిస్టులు ఇందులో పాలు పంచుకోబోతున్నారు. చైతు చేయబోతున్న ఈ కొత్త ప్రయాణం ఎలా ఉండబోతోందో చూడాలి. శోభితని పెళ్లి చేసుకున్నాక కెరీర్ పరంగా రూటు మారుస్తున్నట్టు కనిపిస్తోంది. ఇవి ఫలితాలు ఇస్తే మంచిదే. నిర్మాతగా తన ముద్ర ఎలా ఉండబోతోందనేది దూత 2తో బయట పడనుంది. ఇదే కాదు త్వరలో సినిమా నిర్మాణంలోకి కూడా నాగచైతన్య అడుగు పెట్టబోతున్నట్టు సమాచారం. తండ్రి నాగ్, తమ్ముడు అఖిల్. మామ వెంకటేష్ తో పాటు రానా తదితరులంతా ఫ్యామిలీలోనే ఉన్నారు. సో లైనప్ బాగా ప్లాన్ చేసుకోవచ్చు.

## కొత్త నిప్పు రాజేసిన వీరభద్రుడు



ఎవరో జ్వాలలు రగిలించారు వేరెవరో దానికి బలి అయ్యారు అనే పాట ఊరికే పుట్టలేదు. గత నెల విడుదలై తమిళంలో మూడు వందల కోట్ల వైపు పరుగులు పెడుతున్న కరుప్పు అలియాస్ వీరభద్రుడు ఇప్పుడో కొత్త నిప్పు రాజేశాడు. ఇటీవలే దర్శకుడు ఆర్జె బాలాజీ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ని కలుసుకున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మొదట కరుప్పు విజయ్ కే వెళ్లిందని, ఆయన చివరి మూవీ ఇదైతే బాగుంటుందనే ఉద్దేశంతో కథ చెప్పానని అన్నాడు. ఇక్కడిదాకా బాగానే ఉంది ఎడిటర్ కలైవనన్ మరో సందర్భంలో మాట్లాడుతూ ఒకవేళ కరుప్పు విజయ్ కనక చేసి ఉంటే మరో స్థాయిలో ఉండేదని, బ్లాస్ట్ అయ్యేదన్న రేంజ్ లో ఎలివేషన్ ఇచ్చారు. ఇది కాస్తా సూర్య అభిమానులకు ఆగ్రహం కలిగించింది. కేవలం విజయ్ వద్దు అన్నందుకు వేరే ఆప్షన్ లేక సూర్యతో తీశారని, లేదంటే ఇంకా పెద్ద హిట్ అయ్యేదని అర్థం వచ్చేలా పైన రెండు స్టేట్ మెంట్లు ఉండటంతో సోషల్ మీడియా వేదికగా ఇదో కాంట్రావర్సీకి దారి తీసింది. ఇదంతా గమనించిన సూర్య నేరుగా కాకపోయినా ఇన్ డైరెక్ట్ గా ప్రేమతో ఉండండి అంటూ ఒక సాధారణ ట్వీట్ వేయడం ఇంకో చర్చకు దారి తీసింది. ఇది ఎక్కడికో వెళ్తుందని గుర్తించిన కలైవనన్ తన తప్పును సరిదిద్దుకుంటూ నేను అన్నది ఇంకో అర్థంలో వెళ్లిపోయిందని, మరోసారి ఇలా నోరు జారకుండా చూసుకుంటానని వివరణ ఇవ్వడం ఫైనల్ ట్విస్టు. ఆర్జె బాలాజీ సైతం సూర్య తనకు జీవితాన్ని ఇచ్చిన దేవుడిగా పలు సందర్భాల్లో వర్ణిస్తూ ఉంటారు. అయినా సినిమా ఇంత పెద్ద సక్సెస్ అయినప్పుడు హీరోని పొగుడుకోవాలే కానీ ఫలానా వాళ్ళు చేస్తే ఇంకా బాగుండేదని చెప్పడం ముమ్మాటికీ తప్పే. పైగా సూర్య కరుప్పుకి పూర్తి న్యాయం చేశాడు. క్లైమాక్స్ లో దేవుడిగా పూనకంతో చేసిన డాన్స్ అందరికీ నప్పేది కాదు. పైగా ఎంత విజయ్ అయినా ఆ స్థాయిలో చేయగలడా అంటే సమాధానం వెంటనే చెప్పలేం. తెలుగు రాష్ట్రాల్లో ముప్పై కోట్ల దాకా వసూలు చేసిన వీరభద్రుడు తాజాగా రిలీజైన పెద్ది వల్ల ఫైనల్ రన్ కు వచ్చేసింది.

## గ్లామర్ కోసమే జాన్వీ పాత్రలు సృష్టిస్తున్నారా



అతిలోకసుందరిగా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న శ్రీదేవి అంటే ఎప్పటికీ చెక్కుచెదరని పేరు. అలాంటి గొప్ప నటికి వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్ హిందీలో పెర్ఫార్మన్స్ అవకాశం ఉన్న పాత్రలు చాలానే చేసింది. గుంజన్ సక్సేనా, గుడ్ లక్ జెర్రీ, మిలి, బవల్, ఉలజ్ లాంటి ఎన్నో అవకాశాలు సంపాదించింది. వీటి కమర్షియల్ లెక్కలు, హిట్టు ఫ్లాపు పక్కన పెడితే నటిగా తన సత్తా చాటినవే. ఇక మన తెలుగుకు వద్దాం. జాన్వీ ఇప్పటిదాకా చేసిన సినిమాలు రెండు. దేవరలో సెకండాఫ్ కే పరిమితం చేసిన దర్శకుడు కొరటాల శివ ఆమెను గ్లామర్ షోకు వాడుకోవడం తప్ప ఏమీ చేయలేకపోయారు. రెండు సాంగ్స్ తప్ప జాన్వీకి వ్యక్తిగతంగా ఒరిగిందేమి లేదు. బ్లాక్ బస్టర్ లో భాగమయ్యానన్న ఆనందం తప్ప. ఇప్పుడు పెద్ది వంతు వచ్చింది. స్టోరీ మళ్ళీ రిపీట్ అయ్యింది. అచ్చియమ్మగా పైట గాల్లోనే ఉంచేసే పాత్రలో దర్శకుడు బుచ్చిబాబు చేయమన్నది పొల్లు పోకుండా చేసి చూపించింది.

## ఆర్టిస్టులను ఇంకొంచెం వాడుకుని ఉంటే



పెద్దిలో అందరూ రామ్ చరణ్, జగపతిబాబు, శివరాజ్ కుమార్ పెర్ఫార్మన్స్ గురించి మాట్లాడుతున్నారు. అందులో ఆశ్చర్యం ఏమి లేదు. దర్శకుడు బుచ్చిబాబు ఈ క్యారెక్టర్లను తీర్చిదిద్దిన విధానం అలా కుదిరింది. అయితే కొంత మిక్స్డ్ టాక్ రావడం వెనుక క్యాస్టింగ్ ని సరిగా వాడుకోలేదనే కామెంట్స్ కూడా అభిమానుల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లో ఎక్కువ కనిపించిన విలన్ దివ్యేందు శర్మ రెండో సగం క్లైమాక్స్ లో తప్ప మళ్ళీ ఎక్కడా కనిపించడు. రావు రమేష్ ఉన్నాడని ఫలానా సీన్ గుర్తు చేస్తే తప్ప సామాన్య ప్రేక్షకులకు ఫ్లాష్ కానంత తక్కువ నిడివి ఆయనకు పెట్టారు. పుష్పలో కూడా లెన్త్ ఎక్కువ లేకపోయినా మంత్రి, సిఎం క్యారెక్టర్ ద్వారా సుకుమార్ ఎలా వాడుకున్నారో తెలిసిందే. శ్రీకాంత్ అయ్యంగార్, జాన్ విజయ్ తదితరులకు గెటప్స్ ఘనంగా ఇచ్చారు కానీ పట్టుమని రెండు డైలాగులు లేవు. కమెడియన్ సత్య మాట్లాడేది కూడా చాలా తక్కువ. ఇలా ఎంతో మందిని బుచ్చిబాబు అలా టచ్ చేసి వదిలేశారనే మాట గట్టిగానే ఉంది. కేవలం రామ్ చరణ్ మీదే ఫోకస్ పెట్టకుండా మరికొన్ని థ్రెడ్స్ ద్వారా అందరినీ వాడుకునేలా కొన్ని మార్పులు చేసి ఉంటే టెంపో పెరిగేదన్న అభిప్రాయాన్ని కొట్టి పారేయలేం. జాన్వీ కపూర్ సైతం ఇంటర్వెల్ తర్వాత చాలా సేపు కనిపించదు. ఇదంతా కథానుసారం చేశామని టీమ్ చెప్పుకున్నా ప్రాముఖ్యత కలిగిన ఆర్టిస్టులు అంత సేపు స్క్రీన్ మీద కనిపించకుండా పోతే కనెక్టివిటీ తగ్గిపోతుంది. పెద్దికొచ్చిన సమస్యల్లో ఇదీ ఒకటని చెప్పక తప్పదు. దీని వల్ల పెద్ది ఎంతవరకు ప్రభావితం చెందిందనేది ఇప్పుడప్పుడే తేలదు. కనీసం వారం పది రోజులు వెయిట్ చేయాల్సి ఉంటుంది. చరణ్ లాంటి టాప్ హీరోకు మొదటి వీకెండ్ ఫుల్స్ పడటం పెద్ద విషయం కాదు. ఒకవేళ వీక్ డేస్ వచ్చాక కూడా ఆక్యుపెన్సీలు బలంగా ఉంటే పెద్ది చేతిలో సాలిడ్ బ్లాక్ బస్టర్ ఉన్నట్టే. ట్రేడ్ అయితే ఆ నమ్మకంతోనే ఉంది. స్క్రీన్ స్పేస్ వల్లనేమో ప్రమోషన్స్ లో జగపతిబాబు తప్ప వేరే ఏ ఇతర ఆర్టిస్టులు కనిపించలేదు కాబోలు.



# బిజినెస్ న్యూస్




## మరోసారి 300 మందికి ఉచిత వీసాలు




యూఏఈలో ఉపాధి పొందాలనుకునే వలస కార్మికులకు మరోసారి ఉచిత వీసాలను ఇప్పించేందుకోసం యూఏఈకి చెందిన ఏడీఎన్‌హెచ్, మన దేశానికి చెందిన జీటీఎం సంస్థలు రిక్రూట్‌మెంట్ మేళా నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాయి. క్లీనింగ్ విభాగంలో 300 మందికి ఉచిత వీసాలు ఇచ్చేందుకు ఈనెల 12న సిరిసిల్ల, జగిత్యాల, 13న నిజామాబాద్, ఆర్మూర్‌లలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. 21 ఏళ్ల వయసు నిండి 40 సంవత్సరాలలోపు వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారికి ఉచితంగా వీసాలు ఇచ్చి, విమాన చార్జీలను సైతం కంపెనీయే భరించనుంది. భారత కరెన్సీలో నెలకు రూ.24 వేల వేతనం చెల్లిస్తూ.. నివాసం, భోజన సదుపాయాన్ని ఏడీఎన్‌హెచ్ కంపెనీ సమకూర్చనుంది. వివరాల కోసం సిరిసిల్ల 83320 17122, జగిత్యాల 83320 42299, నిజామాబాద్ 86868 60999, ఆర్మూర్ 83320 13999 నంబర్లలో సంప్రదించాలి. ఈ సందర్భంగా జీటీఎం సంస్థ చైర్మన్ సతీష్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ ఉచితంగా వీసాలు జారీ చేసే అవకాశం తమ సంస్థకు రావడం ఎంతో విశేషం అన్నారు. వలస వెళ్లేవారిపై నయాపైసా భారం లేకుండా అన్ని వసతులు ఉచితంగా సమకూర్చడం తమ ప్రత్యేకత అని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!



శుక్రవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి, నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 116.66 పాయింట్లు లేదా 0.16 శాతం నష్టంతో 74,243.34 వద్ద, నిఫ్టీ 49.85 పాయింట్లు లేదా 0.21 శాతం నష్టంతో 23,366.70 వద్ద నిలిచాయి. అగ్రి-టెక్ (ఇండియా) లిమిటెడ్, ప్రిమో కెమికల్స్ లిమిటెడ్, రామ్‌కో సిస్టమ్స్ లిమిటెడ్, భగేరియా ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. జాగ్రన్ ప్రకాశన్ లిమిటెడ్, సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, సన్‌ఫ్లాగ్ ఐరన్ & స్టీల్ కంపెనీ లిమిటెడ్, వింధ్య టెలిలింక్స్ లిమిటెడ్, రవీంద్ర ఎనర్జీ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి. మార్కెట్ గురించి సాక్షి వెబ్‌సైట్‌లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప..

## భారత్‌లో కొత్త టాక్సీ సర్వీస్ - ప్రత్యేకతలివే!




వియత్నాంకు చెందిన మొబిలిటీ సర్వీస్ ప్రొవైడర్.. గ్రీన్ ఎస్ఎమ్, భారతదేశంలో గ్రీన్ ఎస్ఎమ్ లిమో టాక్సీ సర్వీస్‌ను అధికారికంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సర్వీస్ కేవలం ఢిల్లీలో మాత్రమే అందుబాటులో ఉంది. తరువాత దశలవారీగా దేశం మొత్తం విస్తరించనుంది. గ్రీన్ ఎస్ఎమ్ కంపెనీ తన సేవలను వియత్నాం దేశంలో మాత్రమే కాకుండా.. లావోస్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియాలలో కూడా విస్తరించింది. ఇప్పుడు భారతదేశంలో అడుగుపెట్టింది. సురక్షితమైన, నమ్మకమైన, అధిక నాణ్యత గల మొబిలిటీ ఎంపికను అందించడంతో పాటు.. డ్రైవర్లకు స్థానిక ఉపాధి అవకాశాలను కూడా కల్పించడమే తమ లక్ష్యమని కంపెనీ చెబుతోంది. గ్రీన్ ఎస్ఎమ్ లిమో అనేది.. ప్రయాణీకుల రవాణా కోసం అభివృద్ధి చేసిన ఏడు సీట్ల ఎలక్ట్రిక్ కారు. ఈ కార్లలో ప్రయాణికుల కోసం త్రాగు నీరు, వెట్ టిష్యూలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల భద్రత కోసం సంస్థ.. తమ వాహనాలలో 'సెక్యూర్-టు-సేఫ్' భద్రతా వ్యవస్థను అమర్చినట్లు వెల్లడించింది. గ్రీన్ ఎస్ఎమ్ లిమోలో కెమెరాలు, ఏఐ బేస్డ్ ఫీచర్స్ మాత్రమే కాకుండా.. డ్రైవర్లు, ప్రయాణీకులిద్దరి కోసం ఎమర్జెన్సీ సపోర్ట్ బటన్స్ ఉంటాయి. కాగా.. కంపెనీ తమ డ్రైవర్లకు ఎలక్ట్రిక్ వాహన నిర్వహణ, రహదారి భద్రత, కస్టమర్ సర్వీస్‌లో శిక్షణ ఇస్తామని కూడా పేర్కొంది. భారతదేశంలోని వినియోగదారులు యాప్ స్టోర్, గూగుల్ ప్లే రెండింటిలోనూ లభించే గ్రీన్ ఎస్ఎమ్ యాప్ ద్వారా గ్రీన్ ఎస్ఎమ్ లిమో రైడ్‌ను బుక్ చేసుకోవచ్చు.

## ఐసీఐసీఐ బ్యాంకుకు సెబీ హెచ్చరిక




దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ షాక్ ఇచ్చింది. వాలంటరీ రిటెన్షన్ రూట్(వీఆర్ఆర్) కింద స్థానిక రుణ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు సెబీ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఈ మేరకు ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలు చేసిన ఒక ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది.

**అసలేం జరిగింది?**

సెక్యూరిటీ కస్టోడియన్ గా వ్యవహరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ ఒక ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ (ఎఫ్‌పీఐ)కు నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి చేకూర్చినట్లు సెబీ గుర్తించింది. వీఆర్ఆర్ ప్రోగ్రామ్ కింద దేశీయ బాండ్లలో పెట్టుబడి పెట్టిన సదరు విదేశీ ఇన్వెస్టర్, లాక్-ఇన్ పీరియడ్ పూర్తి కాకముందే తన నిధులను స్వదేశానికి తిరిగి తీసుకెళ్లేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ అనుమతించింది.

**సెబీ అభ్యంతరం**

నిబంధనల ప్రకారం గడువు ముగియకుండా నిధులను వెనక్కి పంపడం ఆర్‌బీఐ, సెబీ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తూ సెబీ జూన్ 1న బ్యాంకుకు హెచ్చరిక లేఖ పంపింది. ఈ ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను నిర్ణీత కాలపరిమితి లోగా ఎక్స్ఛేంజీలకు వెల్లడించడంలోనూ బ్యాంక్ విఫలమైంది. అనుకోకుండా జరిగిన ఆలస్యం వల్లే ఈ సమాచారాన్ని సకాలంలో సమర్పించలేకపోయామని బ్యాంక్ అంగీకరించింది.

**వీఆర్ఆర్ అంటే ఏమిటి? దాని ప్రాధాన్యత ఏంటి?**

భారతీయ ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్ మార్కెట్లలో విదేశీ పెట్టుబడులను దీర్ఘకాలం పాటు నిలిపి ఉంచేలా ప్రోత్సహించడానికి ఆర్‌బీఐ 2019లో ఈ స్వచ్ఛంద నిలుపుదల మార్గాన్ని (వీఆర్ఆర్) ప్రవేశపెట్టింది. సాధారణ ఎఫ్‌పీఐ పెట్టుబడులపై ఉండే కఠినమైన నియంత్రణ అవసరాల నుంచి విదేశీ ఇన్వెస్టర్లకు ఈ మార్గం ద్వారా కొన్ని మినహాయింపులు లభిస్తాయి. అయితే, ఇందుకు ప్రతిగా సదరు విదేశీ ఇన్వెస్టర్ తమ పెట్టుబడుల్లో ఒక కనీస శాతాన్ని నిర్ణీత కాలం పాటు దేశంలోనే ఉంచేందుకు స్వచ్ఛందంగా కట్టుబడి ఉండాలి. కాగా, ఇటీవలే (ఫిబ్రవరిలో) కేంద్ర బ్యాంక్ ఈ ఎఫ్‌పీఐ పెట్టుబడుల కోసం వీఆర్ఆర్‌ను జనరల్ రూట్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది.

**ఐసీఐసీఐ బ్యాంక్ వివరణ**

సెబీ తీసుకున్న ఈ నియంత్రణ చర్యపై ఐసీఐసీఐ బ్యాంక్ స్పందించింది. ఈ హెచ్చరిక లేఖ కేవలం ఒక నిర్దిష్ట సమ్మతి లోపానికి సంబంధించినది మాత్రమేనని తెలిపింది. 'ఈ చర్య వల్ల బ్యాంకు ఆర్థిక స్థితిగతులపై ఎలాంటి ప్రభావం ఉండదు. బ్యాంకు దైనందిన కార్యకలాపాలు లేదా వ్యాపార నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగదు. భవిష్యత్తులో ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అంతర్గత నియంత్రణలను మరింత బలోపేతం చేస్తాం' అని చెప్పింది. బ్యాంకు మొత్తం పనితీరుపై గానీ, భద్రతపై గానీ దీని ప్రభావం ఏమాత్రం ఉండబోదని మేనేజ్‌మెంట్ ఇన్వెస్టర్లకు, ఖాతాదారులకు భరోసా ఇచ్చింది.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి కాపాడాలి

**కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వేముల సునీత రాణి**




**కోరుట్ల,జూన్ 05(నేటి మన దేశమ్ ప్రతినిధి):**:భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించేందుకు మొక్కలు నాటి, వాటిని పెంచి కాపాడాలని కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేముల సునీత రాణి అన్నారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రికి వచ్చే వారికి, వైద్య సిబ్బందికి మొక్కలు నాటడంపై అవగాహన కల్పించాలన్నారు..ఆనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేముల సునీత రాణి మాట్లాడుతూ చెట్లు నీడ ఇవ్వడంతోపాటు ఆక్సిజన్ అందిస్తాయన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. కాలుష్యం పెరిగిపోయి ప్రజలు క్యాన్సర్, షుగర్ వ్యాధుల బారినపడి మందులపై ఆధారపడుతున్నారని, కాలుష్యం పెరగకుండా.. హైదరాబాద్ మరో ఢిల్లీ కాకుండా.. చెట్లు నాటాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటి ప్లాస్టిక్‌ను దైనందిన జీవితం నుంచి దూరం చేయాలన్నారు. మొక్కలు పెంచడం మన దిన చర్యగా భావించి పుట్టిన రోజులకు, ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వినోద్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య సుధా, డాక్టర్ లక్ష్మీ, ఫార్మసీ ఆఫీసర్ ఉదయ ప్రసాద్, చిరంజీవి, ల్యాబ్ టెక్నీషియన్లు వెంకటేశ్వర్లు, సాజిద్ అలీ, శ్రీధర్, మల్లికార్జున్, హరి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్ సురేందర్ కృష్ణకుమారి, హెడ్ నర్స్ సరిత,వైద్య సిబ్బంది మనోజ్, సంతోష్, వంశి, రమ్య, విక్రమ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు

# డివైడర్ మధ్యలో మొక్కలు నాటండి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, జూన్,05 నేటి మన దేశ మ్ ప్రతినిధి** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో జంక్షన్ సుందరీకరణ, జోట, వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు సంబంధించిన విగ్రహాలు, గ్రీనరీ, మొక్కల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా, శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు చెందిన విగ్రహాలు ఏర్పాటు చేయగా. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులను అభినందించారు. జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సూచించారు. త్వరితగతిన అన్ని సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, డీఈ వాణి, తదితరులు ఉన్నారు.

# మందమర్రి జీఎం కార్యాలయం మరియు కేకే ఓసీపీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం.



**మందమర్రి మే 05 (నేటి మనదేశమ్):** సింగరేణి సీఎండీ శ్రీ బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ ఆదేశాల మేరకు కార్యక్రమాలు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్.ఉద్యోగులు, అధికారులందరితో పర్యావరణ ప్రతిజ్ఞసింగరేణి సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ ప్రత్యేక ఆదేశాలు, సూచనల మేరకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జీ.ఎం) కార్యాలయంతో పాటు కేకే ఓసీపీ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.

**జీఎం కార్యాలయంలో ప్రతిజ్ఞా కార్యక్రమం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయంలోని ప్రతి ఒక్క ఉద్యోగితో ఆయన పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ.. మన గౌరవ సీ.ఎండీ దిశానిర్దేశంలో సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోందని, మారుతున్న కాలానికి అనుగుణంగా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉందన్నారు.ఈ ఏడాది (2026) ప్రపంచ పర్యావరణ దినోత్సవ ముఖ్య నేపథ్యం అయిన "ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం" అనే అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు. సీ.ఎండీ నేతృత్వంలో సింగరేణిని పర్యావరణహిత సంస్థగా తీర్చిదిద్దడమే మన లక్ష్యం. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మనందరి కనీస బాధ్యత."

**జి.ఎల్. ప్రసాద్, ఇన్‌ఛార్జ్ జీఎం**

**కేకే ఓసీపీ లో ఘనంగా వేడుకలు** ఇదే స్ఫూర్తితో కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్.లో కూడా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా పర్యావరణ అధికారి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, అక్కడి సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. గని పరిసరాల్లో మొక్కలు నాటారు.పాల్గొన్న ముఖ్య అధికారులు

**జీఎం కార్యాలయ పరిధిలో:**వెంకటరెడ్డి – ఏరియా పర్యావరణ అధికారి.సత్యనారాయణ -- సీనియర్ పర్సనల్ ఆఫీసర్.శ్రీమతి సరిత – డిప్యూటీ ఎఫ్.ఎమ్ అకౌంట్స్.రమణ -- ఏఐటీయూసీ జీ.ఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్,శ్రమతి గీతిక– ఏఐటీయూసీ జీ.ఎం ఆఫీస్ పిట్ సెక్రటరీ.కేకే ఓసీపీ పరిధిలో:వెంకటవంశీధం– ప్రాజెక్ట్ ఇంజనీర్ రామరాజు – మేనేజర్ శ్రీధర్ గౌడ్ – పర్యావరణ అధికారి కుమారస్వామి -- ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ, సందీప్ – వెల్ఫేర్ ఆఫీసర్.ఈ కార్యక్రమాల్లో జీ.ఎం కార్యాలయ, కేకే ఓసీపీ అధికారులు, సూపర్‌వైజర్లు, క్లరికల్ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు మరియు ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని సంకల్పం తీసుకున్నారు.

# రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఎయిర్ పోర్ట్-ఎమ్మెల్యే పాయల్ శంకర్

**-శంషాబాద్ తర్వాత తెలంగాణలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్..ఆదిలాబాద్‌లో మార్గం సుగమం**



**ఆదిలాబాద్ జూన్ 05 (నేట్ మన దేశమ్ ప్రతినిధి.**తెలంగాణ రాష్ట్రంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత మరో ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి.రక్షణ శాఖ సివిల్ ఏవియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో 1,980 ఎకరాల విస్తీర్ణంలో జాయింట్ ఎయిర్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చురుగ్గా చర్యలు చేపడుతున్నాయి.ప్రస్తుతం రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న 400 ఎకరాల భూమి కాకుండా,అదనంగా మరో 1,550 ఎకరాలు కావాలని కేంద్రం కోరింది.దీనికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఏకంగా 1,580 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధమైంది.ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు,80 ఎకరాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కి కేటాయించనున్నారు.అంతేకాకుండా,విమానాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న 740 కేవీవిద్యుత్ లైన్లను రూ.360 కోట్ల వ్యయంతో తొలగించేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ కేంద్రానికి అధికారిక లేఖ పంపింది.జాయింట్ సెక్రటరీకి ప్రతిని అందించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ ప్రాజెక్టును వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా.రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ మహంతిని ప్రత్యేకంగా కలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం 1,580 ఎకరాల భూమిని కేటాయించడానికి సిద్ధంగా ఉందనే అధికారిక పత్రాన్ని (ప్రతిని) ఆయనకు అందజేశారు.పారిశ్రామిక కారిడార్‌తో మారనున్న జిల్లా రూపురేఖలు శంషాబాద్ తర్వాత అంతటి పెద్ద ఎయిర్‌పోర్ట్ ఇక్కడ రానుండటంతో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు భారీ అవకాశాలు మెండుగా ఉన్నాయి.దీనికి తోడు,ఆదిలాబాద్‌లో పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే మరో 2,000 ఎకరాలలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలుఎయిర్‌పోర్టు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతలకు జిల్లా ప్రజల తరఫున,వ్యక్తిగతంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


# ప్రకృతి విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి...

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**:కొమురం ఆసిఫాబాద్,జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి):**: ?ప్రకృతి విపత్తుల సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరదలు, విపత్తులు సంభవించినప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో వర్షాకాలం ప్రారంభానికి ముందే మరమ్మత్తులు పూర్తి చేయాలని, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వరదల నుండి ప్రజలను రక్షించడానికి బోట్లు, లైఫ్ జాకెట్లు, అవసరమైన పరికరాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన సిబ్బందిని సహాయక చర్యలకు అందుబాటులో ఉంచాలని, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, రహదారులు భవనాల శాఖల ఆధ్వర్యంలో రహదారులు, కల్వర్కులు, లో లెవెల్ వంతెనల మరమ్మత్తులు చేపట్టాలని, కల్వర్టులలో పైపులలో ఉన్న చెత్తను తొలగించాలని తెలిపారు. మిషన్ భగీరథ శాఖల అధికారులు తమ పరిధిలోని ట్యాంకులు, పైప్ లైన్ల మరమ్మతులు చేయాలని, వర్షాకాలంలో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని, నాలా లలోని పూడికను తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని, అవసరమైన బ్లీచింగ్ పౌడర్, దోమల మందులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువులు, కాలువల మరమ్మత్తులు, ప్రాజెక్టుల గేట్ల మరమ్మత్తులు చేయాలని, ప్రాజెక్టులోనికి వచ్చే వరదలపై సమీక్షించుకోవాలని, ప్రాజెక్టు క్రింద ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను గుర్తించి సిద్ధం చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నెలలు నిండిన గర్భిణులను వరదలు సంభవించే ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, డయాలసిస్, ఆస్తమా రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలను గుర్తించాలని, గ్రామాలలో, మున్సిపాలిటీలలో పాతబడిన గృహాలను గుర్తించి అందులో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలలో ఉండేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలని, వరదల కారణంగా పంటలు మునిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా గ్రామాల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వంగిన/విరిగిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉన్న/వ్రేలాడే విద్యుత్ తీగలను వెంటనే మరమ్మత్తు చేయాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరించి వరదలు, విపత్తులు సంభవించినప్పుడు జనజీవనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫ్లోర్ లీటర్ గా సంజయ్



**అదిలాబాద్ జూన్ 05 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా 23వ వార్డ్ కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్ ని నియమించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం,ఈ విధంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ కలిసి మున్సిపల్ ఫ్లోర్ లీడర్గా అందరు కౌన్సిలర్ల అనుమతితో ఇజ్జగిరి సంజయ్ ని మున్సిపల్ ఫ్లోర్ గా నియమించడం జరిగింది.ఈ విధంగా విద్య గిరి సంజయ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నాపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు పార్టీకి,మున్సిపల్ కౌన్సిలర్లకు మున్సిపాలిటీకి నా వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేయడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ పెద్దలందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ ,కౌన్సిలర్లు సన్మానించారు.

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం..

***- పర్యావరణ పరిరక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత..***

***- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల***



**పెద్దపల్లి మే 05 (నేటి మనదేశమ్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్జిలు, సెషన్స్ జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో పెద్దపల్లి ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి సునీత గారు గోదావరిఖని లోని జిల్లా కోర్టు ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా మేడమ్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులు (జడ్జి) కోర్టు ప్రాంగణాలలో లేదా ప్రత్యేక క్యాంపులలో మొక్కలు నాటడం ఒక ఆనవాయితీగా వస్తోందనీ పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, చెట్లు నాటడం మరియు వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. భూమిపై జీవకోటి మనుగడకు స్వచ్ఛమైన పర్యావరణం చాలా అవసరమని, పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం చాలా అవసరమని, అలా చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని జిల్లా జడ్జి అన్నారు. అందువల్ల చెట్లు నాటడం, పర్యావరణ సమస్యలపై అవగాహన కల్పించడం అత్యంత ఆవశ్యకమని అన్నారు. పర్యావరణంపై ప్రభావం చూపడానికి ప్రతి వ్యక్తి తన జీవితకాలంలో కనీసం ఐదు చెట్లను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్ రెడ్డి ,1,2వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ లు స్వారిక, శ్రీనిజ కోహిల్కర్ తో పాటు బార్ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజ ,బార్ అసోసియేషన్ ప్రతినిధులు గుజ్జెటి సత్యనారాయణ, కుడిది వెంకటేష్, గజ్జెల ప్రసన్న, జవ్వాజి శ్రీనివాస్, చిదురాల రమేష్, షాహనవాజ్ ఖాన్, గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని శాఖల సమన్వయం అవసరం

## అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్



**జగిత్యాల, జూన్ 05 (నేటి మన దేశమ్ ప్రతినిధి):**:వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు మరియు నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీ బి. రాజా గౌడ్ సూచించారు.జిల్లా అడిషనల్ కలెక్టర్ సమావేశ మందిరంలో వర్షాకాల సీజనల్ వ్యాధుల నివారణపై నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాలు, పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ, నిల్వ నీటి తొలగింపు, తాగునీటి నాణ్యత పర్యవేక్షణ, దోమల నివారణ చర్యలు మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఆనంతరంజిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. సుజాత మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు. జ్వర సర్వేలు, వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు మరియు దోమల నిర్మూలన చర్యలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.ఆనంతరంఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి అర్చన, డిప్యూటీ డి ఎమ్ అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, జ్వరం వచ్చిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్, డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రాజకుమార్, మున్సిపల్ కమీషనర్ లు సత్యప్రణవ్ ఏ.ఎం.ఓ. సత్యనారాయణ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్, ఎపిడెమోలజిస్ట్ వంశీ కృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు మంకిడి శ్రీనివాస్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 05(నేటి మనదేశమ్),**టేకులపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న అన్ని రకాల దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.రెవెన్యూ సంబంధిత అన్ని ఫైళ్ల స్థితిని పరిశీలించారు. ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి సెక్షన్‌ను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయాలని సిబ్బందికి, జి పి ఓ లకు, గిర్దావర్లకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ వీరభద్రం, గిర్దావర్లు , జి పి ఓ లు , సిబ్బంది పాల్గొన్నారు



# జాతీయ పునరుత్పాదక ఇంధన దినోత్సవం.....

**క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో దూసుకెళుతున్న భారత్...**
**సుస్థిర భవిష్యత్తు కోసం స్వచ్ఛ ఇంధనం - పచ్చని పర్యావరణం ......**
**పునరుత్పాదక ఇంధనం...**
**సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి చోదకం.**
**తరగని శక్తిని వాడదాం.. సుస్థిర భవిష్యత్ కు బాటలు వేద్దాం....**
**జాతీయ పునరుత్పాదక ఇంధన దినోత్సవం సందర్భంగా.....**
**చారిత్రక నేపథ్యం - ఉద్దేశాలు....**


మిట్టపల్లి శ్రీనివాసరావు సీనియర్ జర్నలిస్ట్

పునరుత్పాదక శక్తి వనరుల ఆవశ్యకతను తెలియజేసే లక్ష్యంతో.. భారతదేశంలో ఆగస్టు 20న మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జన్మ దినోత్సవ సందర్భంగా ఆయన పునరుత్పాదక ఇంధనం పై చూపిన ఆసక్తిని గుర్తు చేసుకుంటూ ఆయనకు నివాళిగా ఈరోజును" జాతీయ పునర్పాదక ఇంధన దినోత్సవం" లేదా "అక్షయ్ ఊర్జా దివస్" జరుపుకుంటారు. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చుకుంటూనే పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యతను వివరించి, ప్రజలను అటువైపు మళ్ళించాలని భావించి అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తొలిసారిగా న్యూఢిల్లీలో, పాఠశాల విద్యార్థులతో 2004లో జాతీయ పునరుత్పాదక దినోత్సవం ప్రారంభించడం జరిగింది. దేశంలో సాంప్రదాయ శిలాజేతర ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించటం మరియు శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్నీ తగ్గించడం, సౌర శక్తి పవనశక్తి బయోగ్యాస్, బయోమాస్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం, కాలుష్యాన్ని తగ్గించడం మరియు పర్యావణా అనుకూల ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర అభివృద్ధిని సాధించడమే ప్రధాన ముఖ్య ఉద్దేశాలుగా నిర్వహించడం జరుగుతున్నది. "క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ తో వికసిత్ భారత్" ఇతివృత్తంగా 2026 , ఆగస్టు 20న పునరుత్పాదక ఇంధన దినోత్సవం నిర్వహించడం జరుగుతున్నది.

**పునరుత్పాదక ఇంధనం అంటే ఏమిటి?.....** ఆధునిక సమాజంలో మానవుడి నిత్య జీవితంలో వంట దగ్గర నుండి వ్యవసాయం, పారిశ్రామికం,వాహనాలు, యంత్రాలు ,రవాణా, సమాచార సాంకేతిక పరికరాలు నడపడం కోసం అవసరమైన శక్తి, విద్యుత్ ఉత్పత్తి చేయు పదార్థాన్ని ఇంధనం అంటాము. బొగ్గు, కలప ,పెట్రోలు, డీజిల్ ,కిరోసిన్ ,సహజ గ్యాస్ వంట గ్యాస్ "శిలాజ ఇంధనాలు " సాంప్రదాయ ఇంధనం, పునరుత్పాదక రహిత ఇంధనంగా చెప్పుకుంటాము. ఇవి పరిమితం, వీటిని తిరిగి ఉత్పత్తి చేయలేము, వినియోగం పెరిగే కొద్దీ తగ్గిపోతుంటాయి కారణంగా ధరలు పెరిగి ఆర్థిక భారంగా మారుతున్నాయి. వాతావరణం,పర్యావరణ కాలుష్యం పెరిగి,ప్రజా ఆరోగ్యం దెబ్బ తినటం, దీర్ఘకాలిక రోగాలు బారినపడి ప్రాణాలు కోల్పోవడం మానవ మనుగడ ఆందోళనగా మారింది.

సాంప్రదాయ శిలాజ వనరులకు ప్రత్యామ్నాయలైన " మానవ ప్రమేయం లేకుండా ప్రకృతిలో నిరంతరం లభించే శక్తిని "రెన్యువబుల్ ఎనర్జీ "దీనినే తరిగిపోని శక్తిగా పునరుత్పాదక ఇంధన వనరులుగా.. హరిత ఇంధనం గా పేర్కొంటాము. వీటిని మళ్లీ తిరిగి పొందగలుగుతాము. ఇవి కాలుష్యరహితమైనవి, స్వచ్ఛమైనవి, నిరంతరం లభించేవి, పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైనవి.

పునరుత్పాదక ఇంధన వనరులు...

1. భూమి నుండి జియో ధర్మ ఎనర్జీ.
2. సూర్యుడి కిరణా ద్వారా సోలార్ ఎనర్జీ 3. నీటి నుండి జల విద్యుత్ శక్తి
4. గాలి ద్వారా విండ్ ఎనర్జీ
5. మొక్కలు, జంతువులు, వ్యవసాయ, మున్సిపల్ ఘన,జీవ వ్యర్థాల నుండి లభించే బయోమాస్
6. సముద్రాల ద్వారా టైడల్ ఎనర్జీ.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ద్వారా వికసిత్ భారత్...

వికసిత్ భారత్ లక్ష్యసాధన లో సమ్మిళిత సుస్థిర అభివృద్ధి సాధించడంలో పునరుత్పాదక ఇంధనం వనరులైన సోలార్ , పవన, జల విద్యుత్ ,బయోమాస్ కీలక పాత్ర పోషిస్తాయి. గ్రీన్ హౌస్ వాయువులను, వాతావరణ మార్పులను తగ్గించడానికి దోహదపడతాయి. 2030 నాటికి ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముఖ్యంగా సరసమైన మరియు స్వచ్ఛమైన శక్తి ,వాతావరణ చర్యలు, లక్ష్యాలను సాధించడంలో అనుకూలమైనవి. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సోలార్, పవనశక్తి ద్వారా విద్యుత్తును అందించడంతో సామాజిక అసమానతలు తగ్గించి "అందరికీ శక్తి "సుస్థిర అభివృద్ధి లక్ష్యా నికి బాటలు వేస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా కొత్త సాంకేతికతలు, తయారీ, మరియు నిర్వహణలో భారీగా ఉద్యోగ అవకాశాలు సృష్టించబడి ,స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలపడతాయి.

**ప్రపంచ స్థాయిలో...గ్రీన్ ఎనర్జీ హబ్/ లీడర్ గా దూసుకెళుతున్న భారత్...** మార్చి 2026 నాటికి భారత దేశపు పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం సుమారు 283.5 జిడబ్ల్యు కి చేరింది, ఇది 2014లో కేవలం 76.37 జిడబ్ల్యు ఉన్నది. 2025-26 లోనే అదనంగా 53.3 జిడబ్ల్యు సామర్థ్యం చేరింది. సోలార్ ఎనర్జీ 50%తో 100 జిడబ్ల్యు సామర్థ్యాన్ని దాటింది. విండ్ ఎనర్జీ 50 శాతం దాటింది. దేశంలో మొత్తం వ్యవస్థాపిత విద్యుత్ సామర్థ్యంలో పునరుత్పాదక ఇంధన వనరుల వాటా 51.5 శాతం కు చేరింది. దేశంలో మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో 70% పైగా వాట 6 రాష్ట్రాలు రాజస్థాన్, మహారాష్ట్ర ,గుజరాత్, ఆంధ్ర ప్రదేశ్ ,కర్ణాటక, మధ్యప్రదేశ్ కలిగి ఉన్నాయి. 2030 నాటికి 500 +ఔ సామర్థ్యం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రపంచంలో మొత్తం విద్యుత్ వినియోగంలో భారత్ 3వ స్థానం, పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో 3వ స్థానం సోలార్ శక్తి సామర్థ్యంలో 3వ స్థానం ,పవనశక్తి సామర్థ్యంలో 4వ స్థానం, జల విద్యుత్ సామర్థ్యంలో 5 వ స్థానం కలిగి ఉన్నది. దేశంలో పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా పెరుగుతున్న సామర్థ్యం, సోలార్ శక్తి లో ప్రపంచస్థాయి ప్రాధాన్యం ,ప్రభుత్వ మద్దతు, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర ద్వారా భారత్ను గ్రీన్ ఎనర్జీ హబ్/లీడర్ గా మారుస్తున్నాయని చెప్పవచ్చును.

**సవాళ్లు-పరిష్కార మార్గాలు:** సోలార్,పవన శక్తి స్థిరంగా ఉండవు వాతావరణం మార్పులు ప్రభావం వలన గ్రిడ్ స్థిరత్వం దెబ్బతింటుంది. దీనితోపాటు భూమి సేకరణ అనుమతుల సమస్య, ఆర్థిక ఇబ్బందులు, ముడి పదార్థాల దిగుమతి పై ఆధారపడటం, గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు తరలించడానికి అవసరమైన ట్రాన్స్మిషన్ లైన్లో సరిగ్గా లేకపోవడం, నిల్వ సాంకేతికతల సౌకర్యాలకొరత, ప్రాజెక్టుల ప్రారంభ పెట్టుబడులు అధికం, విధానపరమైన అనుచ్చితి తోపాటు పునర్పాదక కిందన వినియోగం ప్రయోజనాలపై ప్రజలలో సరిగా అవగాహన లేకపోవడం ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి.

**భారత ప్రభుత్వ ప్రోత్సాహ కార్యక్రమాలు:** పునరుత్పాద కిందన రంగంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తూ భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని మరియు 2070 నాటికి "నికర - సున్నా"" ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం అనేక ప్రోత్సాహ కార్యక్రమాలతో ప్రణాళికలు రూపొందిస్తుంది. పీఎం సూర్య ఘర్ ముక్తిన్ బిజిలి యోజన పథకంతో ఒక కోటేళ్లకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేయడం, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఏర్పాటు , పీఎం కుసుం పథకం ద్వారా రైతులు తమ బీడు భూములలో సోలార్ పంపులు ఏర్పాటు చేసుకోవడానికి మద్దతు , పి ఎల్ ఐ పథకం ఉత్పాదకతో కూడిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నది, నేషనల్ బయో ఎనర్జీ ప్రోగ్రాం అమలు సోలార్ పార్కులు మరియు అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయటం , గ్రీన్ ఎనర్జీ కారిడార్ ద్వారా పునరుత్పాదక ఇం దనాన్ని గ్రిడ్ కు అనుసంధానం చేయడానికి మరియు విద్యుత్ ప్రసారాన్ని మెరుగుపరచడానికి సహాయక కార్యక్రమాలు చేపడుతున్నది.

**తక్షణ కర్తవ్యాలు :** పునరుత్పాదక ఇంధన రంగానికి కేంద్ర బడ్జెట్లో కనీసం 1 శాతం నిధులు కేటాయింపులు చేయాలి. (2026 వరకు అధికంగా 0.6 శాతం మించి జరగలేదు.).ప్రపంచంలో రెన్యువ బుల్ ఎనర్జీ టాప్ లీడర్లుగా ఉన్న డెన్మార్కు, జర్మనీ, చైనా, ఉరుగ్వే,కోస్టారికా దేశాల నుండి మార్గదర్శకంగా... పాలసీ,ం పెట్టుబడింటెక్నాలజీంప్రజల భాగస్వామ్యం విధానాలను అనుసరించాలి.

ఇంధన నిల్వ సాంకేతికత ద్వారా నిలకడ లేని విద్యుత్తును నిలువ చేసి గ్రిడ్డును స్థిరీకరించాలి, సోలార్ మరియు పవన విద్యుత్ శక్తిని కలిపి ఒకే చోట ఉత్పత్తి చేయడం ద్వారా స్థిరమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించవచ్చును హైబ్రిడ్ ప్రాజెక్టులకు ప్రోత్సాహాన్ని కల్పించాలి, అప్రూవ్డు లిస్ట్ ఆఫ్ మోడల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరర్స్ ఏ ఎల్ ఎం వంటి విధానాల ద్వారా దేశీయ తయారీని పెంచాలి, విద్యుత్ కోతలను తగ్గించి అదనపు విద్యుత్తును సమర్థవంతంగా పంపిణీ చేయటానికి గ్రిడ్డులను ఆధునీకరణ చేయాలి, విద్యుత్ పంపిణీ సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం మరియు పీఎం సూర్య ఘర్ ముక్త్ బిజిలి యోజన వంటి రూపా పథకాల ద్వారా వినియోగదారులను నేరుగా ఉత్పత్తిదారులుగా మార్చాలి, సముద్ర తీరంలో పవనశక్తిని ఉపయోగించుకోవడానికి మౌలిక సదుపాయాల్ని కల్పించడం ద్వారా భూసేకరణ సమస్యను నివారిస్తుంది. గృహ అవసరాలకు ఇళ్లల్లో సౌరఫలకాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం, పెట్రోల్ డీజిల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ కార్లు ద్విచక్ర వాహనాలను వాడటం, గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు సౌర పంపు సెట్లు ద్వారా గ్రామీణ జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రజల జీవనశైలిలో కీలక మార్పు అవసరం.

**ప్రజలలో అవగాహన పెంచాలి :** ఆగస్టు 20న జాతీయ పునరుత్పాదక ఇంధన దినోత్సవం సందర్భంగా "పర్యావరణ పరిరక్షణ- స్వచ్ఛ హరిత ఇంధన వనరుల ఆవశ్యకత" మరియు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంపై ప్రజలలో అవగాహన కల్పించాలి. డిసెంబర్ 14న జరుపుకునే జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా "ఇంధన పొదుపు- భవిష్యత్తు భద్రత "అనే ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ రెండు సందర్భాలలో కేంద్ర రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పర్యావరణవేత్తలు, కేంద్ర రాష్ట్రస్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖలు, మీడియా ప్రచార సాధనాలు ద్వారా ప్రజలలో అవగాహన కల్పించి పునరుత్పాదిక శక్తితో జీవనశైలి పరివర్తన చెందే విధంగా కృషి జరగడం అత్యంత ఆవశ్యకం.

## అవంతి కళాశాలలో
# పర్యావరణ దినోత్సవ కార్యక్రమం




**భీమునిపట్నం, జూన్ 05 (నేటి మనదేశమ్)** : తగరపువలస అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అవంతి జాతీయ సేవా పథకం ( ఎన్ సి సి) ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి మరియు ప్రకృతి సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్య అతిథులు పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడముతో పాటు భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని కాలుష్య రహిత వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ , డైరెక్టర్స్ డా. ఎ. చంద్రశేఖర్, ఎస్. విశ్వ ప్రసాద్ , ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. షరీఫ్ , బేసిక్ సైన్స్ విభాగాదిపతి పట్నాయక్ , సంగీతా మిశ్రా, అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మరిడిమాంబ మొదటి వార్షికోత్సవం
## తల్లిని దర్శించుకున్న సిరమ్మ



**భీమునిపట్నం, జూన్ 05 నేటి మనదేశమ్** : భీమిలి జోన్ జీవీఎంసీ 2వ వార్డు స్థానిక కర్రి నమ్మి వానిపేటలో కొలువై ఉన్న శ్రీ మరిడిమాంబ తల్లి మొదటి వార్షికోత్సవం శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. వైసీపీ నాయకులు నమ్మి మాధవరావు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం యిసమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ అమ్మవారిని దర్శించు కున్నారు. గ్రామస్తులు, భక్తుల కోలాహలం మధ్య ఆలయానికి చేరుకున్న వీరు ప్రత్యేక పూజలు నిర్వ హించి మొక్కులు చెల్లించు కున్నారు. శ్రీ మరిడి మాంబ తల్లి గ్రామ దేవత పండుగను కళ్లారా వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలగ కుండా గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ వారు ఏర్పాటుచేసిన అన్నా ప్రసాదం కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అక్కరమాని రాము నాయుడు, జీవీఎంసీ 2వ వార్డ్ అధ్యక్షులు చిల్ల భాస్కర్ రెడ్డి,రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ కరుణాకర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, బూత్ అధ్యక్షుడు ఎస్ వంశీ, పీతల వెంకట అప్పారావు, నమ్మి శ్రీరామ్,నమ్మి సింహాచలం లతో పాటు చిన్న శీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోటవాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, పాల్గొన్నారు

## యమునా పుష్కరాలకు
# కాకినాడ నుండి ప్రత్యేక బస్సులు




**కాకినాడ, జూన్ 05 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కాకినాడ డిపో నుండి యమునా పుష్కరాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోందని డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు కాకినాడ డిపో నుండి స్టార్ లైనర్, సూపర్ లగ్జరి బస్సులు బయలుదేరతాయని అన్నారు. 11రోజుల పాటు జరిగే ఈ యాత్రలో సింహాచలం, భువనేశ్వర్, కోణార్క్, పూరి, అయోధ్య, కాశీ, ప్రయాగరాజ్, గయ, బుద్ధగయ, జాజ్ పూర్, ఆగ్రా, బృందావనం, మధుర (యమునా పుష్కర స్నానం) తదితర పుణ్యక్షేత్రాల పర్యటన ఉంటుందన్నారు. స్టార్ లైనర్ (నాన్ ఏసీ బెర్త్) టిక్కెట్ ధర రూ.17 వేలు, సూపర్ లగ్జరి (2ం2సీటింగ్,పుష్ బ్యాక్, టీవీ సౌకర్యం) రూ.13,300 లు గా నిర్ణయించామన్నారు. ప్రయాణంలో ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇతర ఖర్చులు, దేవాలయాలలో పూజలు, దర్శనం టిక్కెట్లు ప్రయాణికులే భరించాలని మనోహర్ అన్నారు. ఇతర సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 7382 910869, 9912421137, 7382910769 అసిస్టెంట్ మేనేజర్ ను 9492833885ను సంప్రదించాలని సూచించారు.

## సముద్రంలో వేటకు వెళ్లి
## నీటమునిగి వృద్ధ జాలరి మృతి


**శింగరాయకొండ (ప్రకాశం), జూన్ 05 (నేటి మనదేశమ్) :** సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి వృద్ధ జాలరి మృతి చెందిన ఘటన శుక్రవారం పాకల గ్రామంలో జరిగింది. శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో మత్స్యకారుడు కూర కోసం సముద్రంలో కలిసే పాలేరు పరనీటి దగ్గర చేపల కోసం వెళ్లగా, అక్కడ వేట చేస్తున్న సమయంలో జాలరాములు (60) ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మరణించాడు. లోపల ఉన్న మత్స్యకారులను తోటి మత్స్యకారులు బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై లేళ్ల సుధీర్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జోన్ల విధానాన్ని రద్దు చేయాలి
### విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ (సిఐటియు)

**విజయవాడ, జూన్ 05 నేటి మనదేశమ్** : హాకర్ల ఉపాధిని దెబ్బతిసే జోన్ల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని విజయవాడ హాకర్స్, తోపుడు బండ్ల యూనియన్ -(సిఐటియు) డిమాండ్ చేసింది. శుక్రవారం నగర సమావేశంలో హాకర్స్ యూనియన్ అధ్యక్షులు దొనేపూడి.కాశీనాథ్ మాట్లాడుతూ.... మున్సిపల్ కార్యాలయంలో గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసిన తర్వాత అధికారులు ఇచ్చిన రసీదులను ఈ రోజు యూనియన్ కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. జోన్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 29 న జరిగే ఛలో మున్సిపల్ కార్యాలయం దగ్గర ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిఐటియు సెంట్రల్ సిటి ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, తూర్పు నగర ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరావు, నగర కార్యదర్శి ఎం.సోమేశ్వరరావు, హాకర్స్ యూనియన్ నగర అధ్యక్షులు భూలోకం, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మురళి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.లక్ష్మణ్, కోశాధికారి ఉదయకుమార్, నగర ఉపాధ్యక్షులు, కార్యదర్శిలు మస్తాన్, పెద్దబాజీ, స్రవంతి, బి.లక్ష్మి, పి. శ్రీను, రామారావు, బుజంగారావు, చంద్రశేఖర్, ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జల హారతి పనుల్లో జాప్యం తగదు
### డీఎల్డీవో హేమసుందరరావు



**రాజాం, జూన్ 05 నేటి మనదేశమ్ :** మండలంలో చేపడుతున్న జలధార జల హారతి పనుల్లో తీవ్ర జాప్యం జరుగు తోందని.. ఇది తగదని డీఎల్డీవో హేమసుందరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువులు, పిల్ల కాలువల పనులు 209 మంజూరైతే.. ఇంతవరకు 131 పనులు ప్రారంభం కాగా, వాటిలో 35 పనులు పూర్తి కాగా, 96 పనులు మాత్రమే చేస్తు న్నారని.. మిగిలిన పనుల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని డీఎల్డీవో ప్రశ్నించారు. పనులు సకాంలో పూర్తిచేస్తే ఇంకా అవసరమైన పనులకు అనుమతులు తెచ్చుకోవడానికి అవ కాశం ఉంటుందన్నారు. ఒక్కొక్కరి పరిధిలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి.. ఎన్ని పనులు పూర్తిచేశారు.. మిగిలిన పనులు చేయక పోవడానికి కారణం ఏమిటని ఇంజ నీరింగ్ అసిస్టెంట్లను ఆయన ప్రశ్నించారు. మంజూరు కాని పనులు ఉంటే న దృష్టికి తీసుకువస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి.. పనులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**పలాస, జూన్ 05 (నేటి మనదేశమ్) :** పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలాసలో పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పలాస ముత్యాలమ్మ కోనేరు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు.? ఈ కార్యక్రమంలో కమిషనర్ ఈ.శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ విటల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**



**వేములవాడ, జూన్ 5: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా వేములవాడలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ ని తన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే వేములవాడలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను,గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి,చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు,ఉద్యోగం,స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు , మరియు ఆన్లైన్ ఆర్డర్స్ ,ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి , రాపిడో ,ఓలా , ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లో పనిచేసేటువంటి వ్యక్తుల యొక్క విషయాలను నమోదు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి , కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్, , మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ రోజా, మున్సిపల్ బిల్ కలెక్టర్ ముంజ రమేష్ గౌడ్, మరియు మున్సిపల్ మెప్మాసెక్షన్ సిబ్బంది వరాల శోభ , ఆర్పీ పోసులిమంజుల, మున్సిపల్లి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# భూ నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం..

**చట్ట ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది..**
**ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం..**
**పుష్కరాలకు సకల సౌకర్యాలు కల్పిస్తాం..**
**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**



**ధర్మపురి, జూన్ 05(నేటి మన దేశమ్ ప్రతినిధి)**: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధికి భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధి, పుష్కర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులు, భూనిర్వాసితులతో మంత్రి శుక్రవారం ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ నిర్వాసితుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి ముందుకు సాగుతామని తెలిపారు. 2017 -18 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలు ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయమని మంత్రి అన్నారు. ఇప్పటికే పలుమార్లు భూ నిర్వాసితులతో నెలలుగా చర్చలు జరిపామని శనివారం మరో దఫా చర్చలు నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృద్ధి కోరకు స్థానికులంతా సహకరించాలని ఎవరు క్షేత్ర అభివృద్ధిలో రాజకీయాలు చేయద్దని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని అభివృద్ధి విషయంలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి కోరారు. దేశం నలుమూలల నుండి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూములు, ఇల్లు కోల్పోతున్న వారు పెద్ద మనసుతో సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2027 జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మొదటి విడతగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటి లింగాలకు రూ. 117 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేటాయించారని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బైపాస్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మరిన్ని సౌకర్యాల కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని త్వరలోనే నిధులు సాధించి పుష్కరాలకు ముందే పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. సమీక్ష సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మితో పాటు దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : జిల్లా కలెక్టర్ అంకిత్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 05, (నేటి మనదేశమ్),**అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్ వి. కే. సి. ఏం ప్రాంతంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.



భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి కృష్ణ గౌడ్ తదితరులు కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంది..

**- రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**



**నిర్మల్ , జూన్ 05 (నేటి మనదేశమ్ ప్రతినిధి)**: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ, దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని అన్నారు. దివ్యాంగుల కొరకు రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతుందన్నారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ విషయంలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, దివ్యాంగుల ఉన్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాలు ఉపయోగించుకొని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగుల కొరకు స్కూటీలు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన పలువురు దివ్యాంగులకు కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ లు ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్ లు, అడ్వాన్స్ చక్రాల కుర్చీలు అందించారు. అనంతరం కలెక్టర్ ప్రాంగణంలో కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**కొమురం ఆసిఫాబాద్,జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి)::** ? పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలోని పెంచికల్‌పేట్ ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి. నితికా పంత్, జిల్లా అటవీ అధికారి బాలామణి, జిల్లా అదనపు ఎస్.పి. (అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి అప్పయ్య లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయమైన పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలిగితే భావితరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ఎలినో ప్రభావం వలన ఉష్ణోగ్రత పెరగడం, నీటి లభ్యత తగ్గడం మానవాళి మనుగడకు ప్రమాదం అని తెలిపారు. చెట్లు నాటడమే కాకుండా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకేలా కృషి చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్లు వినియోగించడం వలన పర్యావరణానికి ఉప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని తెలిపారు. జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు సహజసిద్ధమైన, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించిన వారమవుతామని తెలిపారు. నేడు మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వల్ల భవిష్యత్తు తరాల వారు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని, ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవావరణాన్ని కలుషితం చేస్తాయని, ప్రతి ఒక్కరూ చెట్లు నాటి సంరక్షించుకోవాలని తెలిపారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా అటవీ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటాలని, తద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందిస్తామని అన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క ముక్క నాటి సంరక్షించగలిగితే హరిత తెలంగాణ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ రహిత నిత్యావసర వస్తువుల వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్‌ను సందర్శించి, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గోడ ప్రతులను ఆవిష్కరించారుఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి అనిల్ కుమార్, అటవీ అధికారులు, స్థానిక సర్పంచ్ భక్తు రామచందర్, అటవీ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రవణ నక్షత్రం సందర్భంగా ఘనంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం



**నేరెడ్ మెట్ , మే 05 (నేటి మనదేశమ్):** వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుకల్యాణ మహత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. 400 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి ఆశీర్వాదాలు పొందారు. కాగా, ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రకటించింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరింది. బ్రహ్మోత్సవాల నిర్వహణకు భక్తులు నగదు లేదా వస్తు రూపంలో సహకరించాలని దేవస్థాన కమిటీ విజ్ఞప్తి చేసింది.

# శ్రీసాయి గ్రామ సంఘ భవన నిర్మాణం కోసం భూమి పూజ




**మల్లంపల్లి,జూన్:5(నేటిమ నదేశమ్ ప్రతినిధి ).** మల్లంపల్లి మండలం దేవ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ సాయి గ్రామ సంఘం భవన నిర్మాణం కోసం భూమి పూజ చేసి ముగ్గు పోశారు ఈ కార్యక్రమంలో ఆక్వా చైర్మన్ రవీందర్ రెడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ కుమారస్వామి, వార్డు మెంబర్లు ఏ ఈ లత గ్రామ సంఘం ఓబీ సభ్యులు మహిళలు సీసీ మల్లా చారి వివోఏ సరోజన తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు మనాటిన న్యాయమూర్తులు



**హుజూర్‌నగర్ జూన్ 05(నేటి మన దేశం ప్రతినిధి):**చెట్లను విరివిగా నాటి సంరక్షిస్తే అవి జీవకోటికి ప్రాణాధారంగా నిలుస్తాయని హుజూర్‌నగర్ కోర్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హుజూర్‌నగర్ కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్,ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప,అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,విచక్షణారహితంగా చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. చెట్ల కొరత కారణంగా కాలుష్యం పెరిగి అనేక ఆరోగ్య,పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ఆవరణలో,వ్యవసాయ భూముల్లో లేదా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించి అందరూ ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు,గొట్టే ప్రశాంత్, ధూళిపాల శ్రీనివాసరావు,నాగపాషా,సైదా హుస్సేన్, రమేష్, షమీనా,రామలక్ష్మారెడ్డి,పసుపులేటి వీరు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రేమజ్యోతి, న్యాయ సేవా అధికార సంస్థ సిబ్బంది అనిత,సుశీల, సీనియర్, జూనియర్ న్యాయవాదులు,పారా లీగల్ వాలంటీర్లు, పోలీసులు,అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద మొక్క నాటాలి.

**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం**



**అదిలాబాద్ జూన్ 05 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** శుక్రవారం రోజు పట్టణంలో ప్రపంచం పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కే నామ్ పే కార్యక్రమంలో భాగంగా జూన్ 5 న జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అమ్మ పేరు మీద మొక్కలు నాటడం జరిగినది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాటంగే బ్రహ్మానందం,దినేష్ మతోలియ,కోటగిరి రాకేష్ , బొండాల వెంకటస్వామి, తాటిపల్లి రాజు,ఆత్రం సాయి,దేవీదాస్,కేంద్ర శివ,గోపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోలేటి జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి మే 05 (నేటి మనదేశమ్):** టిఆర్ఎస్ యూత్ లీడర్ పల్లె రమేష్ ఆధ్వర్యంలో కోలేటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈశ్వర కృప ఆశ్రమంలో మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈశ్వర కృప ఆశ్రమంలో కేక్ కటింగ్, అన్నదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోరకంటి చందర్ హాజరయ్యారు. అలాగే కోలేటి శీనన్న, ఈశ్వర కృప నిర్వాహకులు పిటి స్వామి, నారాయణదాసు మారుతి, దొమ్మేటి వాసు, గోదావరిఖని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నటరాజ్ సంపత్, మహేష్, నవీన్, అజయ్, నిఖిల్, పాణి నవీన్, రాంబాబు, యశ్వంత్ రెడ్డి, శ్రీరామ్, కార్తికేయ, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బొలీవియా మాజీ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసేందుకు అమెరికా ప్రయత్నం



సూక్రే : బొలివియా ప్రభుత్వ మద్దతుతో అమెరికా తనను అక్రమంగా కిడ్నాప్ చేసేం దుకు కుట్ర పన్నుతుందోని ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఎవో మోరల్స్ వ్యాఖ్యానించారు. ఈ కుట్రను ఆయన గురువారం తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే తన కిడ్నాప్ తేదీ కూడా ఖరారైనట్లు ఆయన వెల్లడించారు. కేబినెట్ సమావేశాల్లో రక్షణ మంత్రి తన కిడ్నాప్ తేది జూన్ 13న నిర్ణయించినట్లు తెలిసిందని మోరల్స్ అన్నారు. అలాగే మోరల్స్‌ని కిడ్నాప్ చేసి.. విరు విరు విమానాశ్రయం నుండి బ్యూనస్ ఎయిర్స్ లేదా లిమాకు.. ఆతర్వాత వాషింగ్టన్‌కు తరలించే బదిలీ మార్గాలను ఉన్నత స్థాయి, పౌర, సైనిక అధికారులు రూపొందిస్తున్నారని మోరల్స్ ఆరోపించారు. కాగా, సామాజిక సంస్థలు, దేశీయ రైతు సంఘాలు మోరల్స్‌ని కిడ్నాప్‌ని తీవ్రంగా ఖండించాయి.

ఈ సంస్థలు కిడ్నాప్‌కు సంబంధించి కోచాబంబా ఉష్ణమండల ప్రాంతంలోని నిఘా కార్యకలాపాల గురించి సాంకేతిక వివరాలను అందించాయి. డెల్టా ఎన్ ప్లాన్ కింద అమలు చేసే ఈ కిడ్నాప్ ప్రణాళికను కల్నల్ ఎడ్సన్ రోజాస్, మేజర్ అయాలా సమన్వయం చేస్తున్నారని, దీనికి యు.ఎస్‌ఏజెన్సీల నుండి రాజకీయ మద్దతు లభిస్తోందని ప్రముఖ ప్రతి నిధులు తెలిపారు. బొలివియా సహజ వనరుల్ని దోచుకోవడానికి, ఈ దేశంలో అత్యధికంగా లభించే లిథియంను అమెరికాకు అప్పగించడానికే బొలివియా రోడ్రిగో పాజ్ ప్రభుత్వం ఈ చర్యలకు సహకరిస్తుందని కార్మిక రైతు నాయకత్వం తీవ్ర విమర్శలు చేసింది.

# చైనాలో బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

## 21 మంది మృతి, 60 మందికిపైగా గాయాలు



బీజింగ్ : చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లోని ఓ బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 21 మంది మృతి చెందారు. 61 మందికి గాయాలయ్యాయి అని అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రాంతీయ రాజధాని అయిన చాంగ్షా పరిధిలోని కౌంటీ స్థాయి నగరమైన లియుయాంగ్‌లో, హువాషెంగ్ బాణసంచా తయారీ సంస్థ నిర్వహిస్తున్న ప్లాంట్‌లో సోమవారం మధ్యాహ్నం ఈ పేలుడు సంభవించింది. ఈ ఘటనకు సంబంధించి వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌అయ్యాయి. ఈ వీడియోల ప్రకారం కిలోమీటర్ల మేర మంటలు వ్యాపించి భారీ నష్టం వాటిల్లినట్లు చూపించాయి. కాగా, సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. దాదాపు 480 మందికిపైగా రెస్క్యూ సిబ్బంది చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ రోబోట్‌లు కూడా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ఈ పేలుడు ఘటనలో 21 మంది మృతి చెందారని, 61 మందికి గాయాలయ్యాయని రెస్క్యూ అధికారులు వెల్లడించారు. గాయాలపాలైన వారిని చికిత్స కోసం ఆసుప్రతికి తరలించారు. రెండో రౌండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. బాణాసంచా తయారీకి, ఎగుమతి చేయడంలో చైనా అగ్రస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం పేలుడు జరిగిన ప్రదేశం రెండు బ్లాక్ పౌడర్ గిడ్డంగులకు సమీపంలో ఉంది. దీంతో అక్కడ మరో ప్రమాదం జరగకుండా బఫర్ జోన్‌ను ఏర్పాటు చేశారు. సహాయక సిబ్బంది సమీప నివాసితులను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు అని ప్రభుత్వ మీడియా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. సహాయక చర్యలకు మార్గనిర్దేశం చేసేందుకు అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ నిపుణులను సంఘటనా స్థలానికి పంపింది. ఈ కంపెనీ బాధ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంపెనీలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని మీడియా వెల్లడించింది.

# 'జేఈఈ అడ్వాన్స్‌డ్' డేటా లీక్ భయాలు..

## ఆ ప్రచారాన్ని ఖండించిన ఐఐటీ రూర్కీ



జేఈఈ (అడ్వాన్స్‌డ్)-2026 రాసిన విద్యార్థుల వ్యక్తిగత డేటా లీక్‌అయిందని, వారి గోప్యతకు భంగం వాటిల్లిందంటూ జరుగుతోన్న ప్రచారాన్ని ఐఐటీ రూర్కీ ఖండించింది. అవన్నీ అసత్య కథనాలేనని కొట్టిపారేసింది. జేఈఈ (అడ్వాన్స్‌డ్) - 2026 ఫలితాలకు సంబంధించిన క్లౌడ్ స్టోరేజ్ కాన్ఫిగరేషన్‌లో లోపం ఉన్న విషయం వాస్తవమేనని పేర్కొంది. అయితే, క్లౌడ్ స్టోరేజ్‌లో ఉన్న విద్యార్థుల డేటా కేవలం చదవడానికి మాత్రమే వీలుం దని, మార్పు చేర్పులు చేసేందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. విద్యార్థులను తప్పుదోవ పట్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఇటు వంటి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఐఐటీ రూర్కీ పేర్కొంది. క్లౌడ్ స్టోరేజ్ నుంచి ఏ విద్యార్థికి సంబంధించిన సమాచారాన్ని ఎవరూ సంగ్రహించలేరని.. అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు, పరీక్ష ఫలి తాలపై ఎలాంటి ప్రభావం పడలేదని వెల్లడిం చింది. అయినప్పటికీ, సమాచార గోప్యతను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపింది.

# యూఏఈపై ఇరాన్ డ్రోన్ దాడి.. ముగ్గురు భారతీయులకు గాయాలు..



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రమవుతున్నాయి. తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫుజైరా ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడి ఆందోళన కలిగిస్తోంది. ఫుజైరాలోని చమురు నిల్వ కేంద్రం, ఇండస్ట్రియల్ జోన్‌పై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఈ దాడి కారణంగా అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఇరాన్ చేసిన ఈ దాడి కారణంగా ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. అయితే వీరికి ప్రాణాపాయం లేదని, ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగడం ఇదే తొలిసారి. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతలే ఈ దాడికి కారణంగా కనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధిలో నౌకలకు రక్షణ కల్పించేందుకు అమెరికా అధ్యక్షుడు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' ప్రారంభించారు. తమ 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' కారణంగా సోమవారం రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు అమెరికా సైన్యం ప్రకటించింది. దానిని ఇరాన్ ఖండించింది. తమ అనుమతి లేకుండా ఓ అమెరికా నౌక జలసంధి దాటడానికి ప్రయత్నించిందని, దానిపై క్షిపణులతో దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ ప్రకటనను అమెరికా ఖండించింది. తమ నౌకలపై ఎలాంటి దాడులూ జరగలేదని వెల్లడించింది.


# కాసేపు లాక్‌డౌన్‌లో వైట్‌హౌస్ .. ఎందుకంటే..?



అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ సమీపంలో మరోసారి భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. భద్రతా బలగాలపై ఓ సాయుధుడు కాల్పులకు దిగడంతో.. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఎదురుకాల్పులు జరిపారు. ఆ సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోనే ఉన్నారు. దాంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది కొంతసేపు వైట్‌హౌస్‌ను మూసివేశారు. ఈ కాల్పులు జరగడానికి కొంతసేపటికి ముందే ఆ రోడ్డులో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కాన్వాయ్ వెళ్లినట్లు అధికారులు తెలిపారు. జేడీ వాన్స్ లక్ష్యంగా కాల్పులు జరిగాయని తాము భావించడం లేదని యూఎస్ సీక్రెట్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ మాథ్యూ క్విన్ పేర్కొన్నారు. ఇటీవల వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో నిర్వహించిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియాతోపాటు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో ఆ ఈవెంట్‌లో ఉన్న సమయంలో ఆ ఘటన జరిగింది.

దానికి తాజా ఘటనతో ఏదైనా సంబంధం ఉందా..? అనేది ఇప్పుడే చెప్పలేమని క్విన్ వెల్లడించారు.

# అరుదైన వైరస్ కలకలం.. సముద్రంలో నిలిచిన నౌక



ఒక క్రూజ్ నౌకలో అరుదైన వైరస్ కలకలం సృష్టిస్తోంది. దాంతో అందులో ఉన్న ప్రయాణికులు సముద్రంలో సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా అట్లాంటిక్ మహాసముద్రంలో కేప్ వెర్డే తీరానికి సమీపంలో వేచిఉన్నారు. ఇప్పటికే ముగ్గురు ప్రయాణికులు మృతి చెందడం.. మరో ముగ్గురు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో వారు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, షిప్ ఆపరేటర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎంవీ హెుండియస్ (డచ్‌షిప్) దాదాపు 150 మంది ప్రయాణికులతో అర్జెంటీనా నుంచి బయల్దేరింది. వాస్తవంగా అంటార్కిటికా, అట్లాంటిక్ మహా సముద్రంలో వారం రోజుల పాటు ఈ యాత్ర కొనసాగాల్సి ఉంది. అయితే అంతలోనే వైరస్ వ్యాప్తి చెందడంతో కేప్ వెర్డే తీరంలోకి వచ్చిన తర్వాత సహాయం కోసం నౌక నుంచి స్థానిక అధికారులకు అభ్యర్థన వెళ్లింది. అయితే అందులోని వారు దిగేందుకు అనుమతి లభించలేదు. ప్రజారోగ్య ఆందోళనల దృష్ట్యా తమ రేవులో ఆ నౌకను నిలిపేందుకు ప్రస్తుతానికి అనుమతివ్వలేదని కేప్ వెర్డే ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తమ తీరానికి దూరంగా సముద్ర జలాల్లో అది నిలిచిఉందని పేర్కొంది. నౌకలోని ప్రస్తుత పరిస్థితికి అరుదైన హంటా వైరస్ కారణమని అనుమానిస్తున్నారు ఇది ఎలుకల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉందని గతంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే క్రూజ్ షిప్‌లోకి ఈ వైరస్ ఎలా వ్యాపించిందనే దానిపై మాత్రం స్పష్టత లేదు. మే 4 నాటికి 7 హంటా వైరస్ కేసులు వెలుగులోకి వచ్చాయి. వైద్య పరీక్షల్లో రెండు కేసులు ధ్రువీకరణ అయ్యాయి. ఇప్పటికే ముగ్గురు మరణించగా.. మరొకరిలో తీవ్ర లక్షణాలు కనిపిస్తున్నాయి. మిగతా ముగ్గురిలో లక్షణాలు స్వల్పంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆ నౌకలో 88 మంది ప్రయాణికులు, 60 మంది వరకు సిబ్బంది ఉన్నారు. మృతి చెందిన జర్మన్ జాతీయుడి మృతదేహం ఇప్పటికీ ఆ షిప్‌లోనే ఉందని మీడియా కథనాలు వెల్లడించాయి.

# రాజస్థాన్ లో ఎబోలా అనుమానిత కేసు




జైపూర్ : రాజస్థాన్ లో ఎబోలా అనుమానిత కేసు నమోదైంది. ఉగాండా నుండి రాజస్థాన్ వచ్చిన ఒక మహిళలో ఎబోలా వైరస్ లక్షణాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం షార్జా నుండి జైపూర్ విమానాశ్రయానికి చేరుకున్న ఆ మహిళకు సాధారణ తనిఖీల్లో వైరస్ లక్షణాలు కనిపించాయని అన్నారు. వెంటనే ఆమెను జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఐసోలేషన్ లో ఉంచామని చెప్పారు. ఆ మహిళ నుండి సేకరించిన నమూనాలను పరీక్షల కోసం పూణేలోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఎబోలా వైరస్ ఇంకా నిర్ధారణ కాలేదని, నివేదిక అందిన తర్వాతే ఈ ఇన్ఫెక్షన్‌ను నిర్ధారించగలమని రాజస్థాన్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సూపరింటెండెంట్ అనిల్ గుప్తా పేర్కొన్నారు. నివేదిక శనివారం వెలువడే అవకాశం ఉందని అన్నారు. మరోవైపు గురువారం హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో సూడాన్ జాతీయుడిలో ఎబోలా లక్షణాలను గుర్తించారు. ఆ వ్యక్తిని సికింద్రాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు.


ఆ వ్యక్తి నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి)కి పంపినట్లు ఆస్పత్రి అధికారులు వెల్లడించారు. కాంగో మరియు ఉగాండాల్లో ఎబోలా వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందడంతో డబ్ల్యుహెచ్ ఒ అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సంగతి తెలిసిందే. వ్యాధి తీవ్రత దృష్ట్యా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణాలను నివారించాలని కేంద్ర ప్రభుత్వం భారత పౌరులకు సూచించింది.

# కైలాశ్ మానసరోవర్ యాత్ర మార్గంపై నేపాల్ అభ్యంతరం

నేపాల్ : పాస్ ద్వారా కైలాశ్ మానసరోవర్ యాత్రను నిర్వహించాలన్న భారత ప్రణాళికలపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. లిపులేఖ్ తమ భూభాగమని పేర్కొంది. తమను సంప్రదిం చకుండా ఆ మార్గంలో యాత్రకు ప్రణాళికలు రూపొందించడమేంటని ప్రశ్నించింది. నేపాల్ విదేశాంగ శాఖ ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ తమ భూభాగాలేనని అందులో పేర్కొంది. లిపులేఖ్ ద్వారా యాత్ర ప్రణాళికలను రూపొందిం చినందుకు చైనాకూ తమ అభ్యంతరం తెలియజేశామంది. మరోవైపు- నేపాల్ అభ్యంతరాన్ని భారత్ తిరస్కరించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ గుండా కైలాశ్ మానసరోవర్ యాత్ర దశాబ్దాలుగా సాగుతోందని గుర్తుచేసింది. భూభాగాల విషయంలో ఏకపక్షంగా ప్రకటనలు చేయడం ఎంతమాత్రమూ అంగీకార యోగ్యం కాదంటూ హితవు పలికింది.

# భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం

## పుతిన్ ప్రశంసలు



మాస్కో: భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశమని, ఆదేశంతో తమ సంబంధాలను మరింత విస్తరించుకోవాలని నిర్ణయించు కున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. రష్యాతో సహకారాన్ని తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా మరియు ఇతర పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు నిష్ఫలమైనవని, అవి అంతర్జాతీయ సంబంధాలకు నష్టం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశ ఆర్థిక వృద్ధిని, ఆ దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ప్రశంసించారు. భారత్‌తో ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి రష్యా నిశ్చయించుకుందని, రాబోయే సంవత్స రాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రష్యాతో సంబంధాలను పరిమితం చేయాలంటూ భారత్‌పై పశ్చిమ దేశాలు ఒత్తిడి తెస్తున్నప్పటికీ, దానివల్ల తమపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడలేదని పుతిన్ సూచించారు.

# ప్రయాణీకుల పడవలపై అమెరికా సైన్యం దాడి : ఐదుగురు మృతి



టెహ్రాన్ హోర్ముజ్ జలసంధిలో ప్రయాణీకుల పడవలపై అమెరికా సైన్యం దాడి చేసింది. ఈ దాడిలో పడవలో ఉన్న ఐదుగురు ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ఇరాన్ సైన్యం ఖండించింది. అయితే ఇరాన్ సైన్యం ఆరోపిస్తున్నట్లుగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన పడవలపై కాకుండా, ప్రయాణీకుల పడవల పైనే తమ సైన్యం దాడులు జరిపిందని అమెరికా సైన్యం వెల్లడించింది. కాగా, హోర్ముజ్ జలసంధి నుండి చిక్కుకుపోయిన నౌకలను బయటకు తీసుకువచ్చే అమెరికా మిషన్‌కు ఆటంకం కలిగించడానికి ప్రయత్నించిన ఆరు ఐఆర్‌జిసి నౌకలను సెంట్రల్ కమాండ్ దళాలు ముంచివేశాయని ఎ అమెరికా సైన్యపు కమాండర్ చెప్పిన మాటలకు.. మంగళవారం అమెరికా సైన్యం ఐఆర్‌జిసి నౌకలపై కాకుండా.. కేవలం ప్రయాణీకుల పడవలపైనే దాడి చేశామని చెప్పిన మాటలు వాస్తవ విరుద్ధంగా ఉండడం గమనార్హం. అయితే సైన్యపు కమాండర్ ఆరు ఐఆర్‌జిసి నౌకలని చెబితే.. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏడు పడవలని చెప్పారు. అమెరికా అధ్యక్షలు ట్రంప్ తాజాగా 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో సోమవారం కొత్త ప్లాన్ ను ప్రకటించారు. యుద్ధ కారణంగా హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న ఓడలను ఈ ప్లాన్ కింద అమెరికా నేవీ సురక్షితంగా బయటకు తీసుకొస్తుందని ట్రంప్ తెలిపారు. అయితే ఈ ప్రాజెక్ట్ ఫ్రీడమ్ పేరుతో మరోరకంగా ఇరాన్ నౌకలపై అమెరికా సైన్యం దాడులకు దిగుతోంది.

ట్రంప్ ఏప్రిల్ 8వ తేదీన కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి స్వస్థి పలికి... మళ్లీ యుద్ధానికి తెరతీశారని తెలుస్తోంది.

మరోవైపు ఈ ఘటనపై ఇరాన్ దర్యాప్తు ప్రారంభించింది. ఐఆర్‌జిసి నౌకల్లో దేనికీ దెబ్బ తగలనప్పటికీ, సోమవారం ఒమన్ తీరంలోని ఖసాబ్ నుండి ఇరాన్ తీరానికి ప్రయాణికులతో వెళ్తున్న రెండు చిన్న పడవలపై అమెరికా దళాలు దాడి చేశాయని దర్యాప్తులో తేలిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ ఐఆర్ఐబి పేర్కొంది.

అమెరికా సైన్యం చేసిన దాడిలో పడవలు ధ్వసంమయ్యాయి. ఐదుగురు మృతి చెందారని ఇరాన్ సైన్యపు కమాండర్ తెలిపారు. ఈ నేరానికి అమెరికా జవాబు దారీగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే దీనికి అమెరికా సైన్యం నుంచి తక్షణమే స్పందన రాలేదు.

## నీటి నిల్వ చెరువును (ఇంకుడుగుంత ) ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి,జూన్ 05.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఐ డి ఓ సి ప్రాంగణంలో డి యమ్ యఫ్ సి (టి) నిధుల ద్వారా నిర్మించిన నీటి నిల్వ చెరువును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు , పర్యావరణ పరిరక్షణకు నీటి నిల్వ చెరువులు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో వర్షపు నీటిని సద్వినియోగం చేసేందుకు ఇటువంటి చర్యలు చేపట్టడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. డి ఎం ఎఫ్ సి (టి)నిధుల నుంచి రూ. 6.55 లక్షల వ్యయంతో ఈ నీటి నిల్వ చెరువును నిర్మించినట్లు తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇది ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెరువు చుట్టూ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడం ద్వారా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. నీటి నిల్వ చెరువు పరిసర ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలను కూడా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జి అదనపు కలెక్టర్ యన్ గిరి, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో 4.48 కిలోల గంజాయి పట్టివేత



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (ప్రతినిధి, జూన్ 05, (నేటి మనదేశమ్),** కేశవాపురం సమీపంలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రెండు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న 4.480 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఈఎస్ కే. తిరుపతి ఆదేశాల మేరకు ఎస్ఐ సి. హెచ్. శ్రీహరి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రెండు కెటిఎమ్ డ్యూక్ బైక్‌లలో గంజాయి లభ్యమైంది. కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు, ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పట్టుబడిన నిందితుల వద్ద నుంచి 4.480 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల మొత్తం విలువ సుమారు రూ. 4.60 లక్షలుగా అధికారులు తెలిపారు. హెడ్ కానిస్టేబుళు ఖలీల్ అహ్మద్, జమాల్ షరీఫ్, కానిస్టేబుళ్లు శివకుమార్, నాగరాజు, ప్రసన్నకుమార్, ఉపేందర్ తనిఖీల్లో పాల్గొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉన్నవారు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2523కు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా కాపాడాలి-కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ జూన్ 05 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** మారుతున్న వాతావరణ పరిస్థితులు,గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు."ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో అడవుల పునరుజ్జీవనం కోసం సరికొత్త హై డెన్సిటీ మిక్స్ ప్లాంటేషన్ విధానంలో భారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ బృహత్తర కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్,అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ లతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రపంచ పర్యావరణ పరిరక్షణ,అడవుల విస్తీర్ణం పెంపుదలే ధ్యేయంగా ప్రభుత్వం అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృతం అవగాహన కల్పిస్తూ సంరక్షిస్తుందని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం – ప్రగతికి ప్రణాళిక" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ,మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,సర్పంచ్ నిరోష, డిఎస్పీ జీవన్ రెడ్డి,ఎఫ్డిఓ అరవింద్,ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు. విద్యార్థులు,అటవీ,పోలీస్ శాఖ అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.




## భద్రాచలం మండలంలో ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలకు దరఖాస్తులు ఆహ్వానం..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 05, (నేటి మనదేశమ్),** తెలంగాణ ప్రభుత్వము ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ మరియు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026 – 27 విద్యా సంవత్సరానికి భద్రాచలం మండలంలో ఒక ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి తోటమల్ల రమ తెలిపారు. భద్రాచలం లోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల తాతగుడి సెంటర్ నందు ప్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత విద్యార్హత కలిగి ఉండాలని, ఆయా పోస్టుకు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక మొదట హ్యాబిటేషన్, అనంతరము గ్రామపంచాయతీ, మండలము, మరియు జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తు లను 08 జూన్ 2026 తారీకు సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువ పత్రాలను, (విద్యా అర్హతలు, నివాస ధ్రువీకరణ, ఆధార్ కార్డు జిరాక్స్ జత చేసి ) మండల విద్యా వనరుల కేంద్రము, భద్రాచలం నందు సమర్పించాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవ్వాలి..

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులందరికీ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.., పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ కాలుష్యం కారణంగా నేడు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది తమ తమ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ప్రతి ఏడాది అడవులు దగ్ధమవుతున్నాయని, దీని ద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. అడవులు కాలిపోకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రతిజ్ఞ చేశారు. కళాజాత బృందాలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన కలిగేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్డిఓ నాగిని బాను, ఇతర అధికారులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


## బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి..

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్, జూన్ 05 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 2025-26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి, డిఎల్ఆర్ సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయని, ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 2026 – 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇప్ప పువ్వు తో తయారు చేస్తున్న సబ్ ప్రాడక్స్ లడ్డు, పౌడర్. పై శిక్షణ




**ములుగు,జూన్ :5(నేటిమనదేశమ్ ప్రతినిధి )** కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు వారి సౌజన్యంతో ఇప్ప పువ్వు ద్వారా తయారు చేస్తున్నా సబ్ ప్రాడక్స్ లడ్డు, పౌడర్ మరియు లేబ్లింగ్,బ్రాండింగ్ గురించి నవ భారతి మండల సమాఖ్య ములుగులో ములుగు మండలం పోట్లాపూర్ గ్రామానికి చెందిన 10 మంది మహిళలు, తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామానికి చెందిన 10 మహిళలకు శిక్షణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ పరంజ్యోతి అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్ , ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఏపీఎం హెచ్ఆర్ కోటీశ్వర్, ములుగు ఎపిఎం, శ్రీనివాస్ కృషి విజ్ఞాన కేంద్రం అంజి రెడ్డి , మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన సురక్షితమైన హరిత పర్యావరణాన్ని భవిష్యత్తు తరాలకు అందిద్దాం




**కోదాడ మే 05 (నేటి మనదేశమ్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోదాడ పట్టణంలో పిఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో " తల్లి చెట్టు (మదర్ ట్రీ) – పూజ " కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణాన్ని స్వచ్ఛంగా ,సురక్షితంగా, పచ్చదనంగా ఉండేందుకు ప్రతి ఒక్కరం బాధ్యతగా వ్యవహరించాలని" ప్రతిజ్ఞ" చేసినారు. కోదాడ మండల విద్యాధికారి ఎండి .సలీం షరీఫ్, సూర్యాపేట జిల్లా పర్యావరణాధికారి ఎల్. దేవరాజ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడినారు. విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, చెట్లను పెంచి,సంరక్షణ చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, సహజ వనరులను పొదుపుగా వాడటం, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. స్వచ్ఛమైన సురక్షితమైన హరిత పర్యావరణాన్ని భవిష్యత్తు తరాలకి అందించడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పాఠశాలలో " మదర్ ట్రీ "ని ని పుష్పాలంకరణ చేసి, శాలువాలతో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, ఎకో క్లబ్, సిజిఆర్, వై ఈ ఎల్ పి కార్యక్రమ నిర్వాహకులు బడుగుల సైదులు, ఎం. చిన్నప్ప, ఈ. శ్రీనివాసరెడ్డి, ఎస్ కె . ఖాజామీయా, ఎన్ సురేష్, ఎస్ .కే. జానీ, విజయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## వైద్యుల బదిలీల్లో జీవో 38 అమలు చేయాలి:

### ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డా,ముస్కు జైపాల్ రెడ్డి..




**జగిత్యాల, జూన్ 5(నేటి మన దేశమ్ ప్రతినిధి):** వైద్యుల బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38 లో పేర్కొన్న నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీజీజీడీఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ఒక రోజు నిరసన తెలుపుతూ వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 38లో పొందుపరిచిన అన్ని ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ వైద్యులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో లేదా సమీప ప్రాంతాల్లో విధులు నిర్వహించేలా కల్పించే స్పౌస్ ప్రాధాన్యతతో పాటు ఇతర ప్రత్యేక ప్రాధాన్యతా ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. వైద్యులు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే బదిలీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం గుర్తింపు పొందిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవో 38 నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు రాష్ట్ర సంఘం పదాధికారులు ఎవరూ బదిలీలకు సంబంధించిన ఆప్షన్ ఫారాలను సమర్పించవద్దని సమావేశంలో తీర్మానించినట్లు వెల్లడించారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే వైద్యసేవలను నిలిపివేసేందుకు కూడా వెనుకాడబోమని డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో టీజీజీడీఏ జిల్లా కోశాధికారి డాక్టర్ జి. నవీన్‌తో పాటు టీవీవీపీ, మెడికల్ కాలేజీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఉత్తమ గని గా ఎంపిక...




**కొమురం ఆసిఫాబాద్,జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి)::** ?ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (రాజజూ) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఉత్తమ గని గా ఎంపికై సందర్భంగా ఖైరిగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ మత్స్యగిరి నరేందర్ కు డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. సూర్యనారాయణ డైరెక్టర్ (ఈ అండ్ ఎం)డి. తిరుమల రావు గుర్తింపు సంఘం నాయకులు – శ్రీ వంగ వెంకట్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఖైరిగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ మత్స్యగిరి నరేందర్ మాట్లాడుతూ మైనింగ్‌లో పర్యావరణ హితమైన పద్ధతులను పాటిస్తూ, సుస్థిర అభివృద్ధి వైపు విజయవంతంగా అడుగులు వేస్తున్నందుకు గాను ఈ గుర్తింపు లభించిందన్నారు .విజయానికి సహకరించిన ఖైరగుర ప్రాజెక్ట్ కార్మిక సోదరులకు, అధికారులకు మరియు సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు..

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్




**సిద్ధిపేట జూన్ 05 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని మార్పడగ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు ,జిల్లా కలెక్టర్ హైమావతి, సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ , డిఎఫ్ఓ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం, వివిధ విభాగాల అధికారులు..పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగా ప్రారంభించాంప్రపంచమే కుగ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలి మొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలిహుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ చేతల మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం 500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం హుస్నాబాద్ మున్సిపాలిటీ ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుంది..దిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు.తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి ఈవి పాలసీ తీసుకొచ్చారు,దేశంలో ఎక్కడ లేని విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం,మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాము,ప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలిఒకప్పుడు ఎక్కడ చూసినా పండ్ల మొక్కలు ఉండేవి..ఇప్పుడు లేకపోవడం వల్ల కోతులు గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులు పెడుతున్నాయిరాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం..ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలిఎక్కడ ప్రభుత్వం స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలిప్రభుత్వం గీతా కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఇచ్చేటప్పుడు తాటి చెట్లు ఈత చెట్లు నాటిస్తోంది గత సంవత్సరం అటెండర్ నుండి మొదలు జిల్లా కలెక్టర్ వరకు ఒకే రోజు మొక్కలు నాటారు.. అలాంటి కార్యక్రమం తీసుకోవాలి..పర్యావరణాన్ని కాపాడడానికి ప్రకృతి రక్షించడానికి మనం పని చేయాలిపర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయడం కాదు పాటించాలి..గ్రామాల్లో మొక్కలు నాటడం లో ఒక కాంపిటీషన్ క్రియేట్ చేయండి.. మంచిగా మొక్కలు నాటిన గ్రామాల్లో సర్పంచ్ లను అభినందించండి..

## కాలుష్యాన్ని తరిమికొట్టండి, పచ్చదనాన్ని పెంపొందించండి




**సిద్ధిపేట జూన్ 05 నేటి మనదేశమ్ ప్రతినిధి :** జూన్ 5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో కోమటి చెరువు నెక్లెస్ రోడ్ నుండి ముస్తాబాద్ చౌరస్తా వైపు నుండి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (మెదక్ రోడ్డు మల్టీపర్పస్ హై స్కూల్) వరకు పురపాలక సంఘ సిబ్బంది మరియు అంబిటాస్ పాఠశాల చిన్నారులు, మార్నింగ్ వాకర్స్, యువకులు పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సందేశాన్ని ఇస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. చెట్లను కాపాడుకుందాం – పర్యావరణాన్ని రక్షించుకుందాం, ప్లాస్టిక్ వద్దు – ప్రకృతి ముద్దు, మొక్కలు నాటుదాం – కాలుష్యాన్ని పారద్రోలుదాం అంటూ పలు నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. కాలుష్య నివారణ, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం వంటి సందేశాలు రాసిన ప్లకార్డులను ప్రదర్శించడం జరిగింది. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, బట్టల సంచులను ఉపయోగించడం,వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటడం ద్వారా భూమిని పచ్చదనంతో ఉంచాలని కమిషనర్ సూచించారు. పట్టణ ప్రజల సైతం ప్లాస్టిక్ నిషేధించాలని ప్లాస్టిక్ ద్వారా పర్యావరణానికే కాకుండా మానవాళి మనుగడకు సైతం ముప్పుందన్నరు. పట్టణంలో అన్ని వార్డులలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందని ఏవైనా శుభకార్యాలు జరిపినట్లైతే పట్టణ ప్రజలు స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న కాలంలో ఎండ తీవ్రతను తగ్గించాలంటే తప్పనిసరిగా మొక్కలను సంరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను పెంపొందించాలని ఉద్దేశంతో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వారు నెక్లెస్ రోడ్ వద్దకు వాకింగ్ వచ్చిన వారికి కమిషనర్ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. ఐటీసీ బొబొ ఈశ్రీ ఆధ్వర్యంలో మొక్కలను అవగాహన కల్పించుటకు ఆకులు రాలి ఉన్న చెట్టుకి ఆకుల మాదిరి ఉన్న పేపర్ పై ప్రతి ఒక్కరు సంతకం చేస్తూ ఆకులు రాలి ఉన్న చెట్టు కొమ్మలకు అతికించడం ద్వారా చెట్లను కాపాడాలన్న సందేశాన్ని ప్రజలకు అందజేశారు. మరియు పర్యావరణ దినోత్సవ సందర్భంగా క్రాంతి పాఠశాల యాజమాన్యం వారు చిన్నారులకు నిర్వహించిన డ్రాయింగ్ ,వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కమిషనర్ చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కొరకై ప్రతిజ్ఞ చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, శ్రీనివాస్ రెడ్డి ( అంబిటస్ పాఠశాల యాజమాన్యం),భగవాన్ రెడ్డి(క్రాంతి పాఠశాల), డాక్టర్ స్వామి (డెంటల్), అంబిటాస్ పాఠశాల ఒ క్రాంతి పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గన్ పార్క్‌లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్**



**జగిత్యాల,జూన్ 5(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.శుక్రవారంప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలి**

**మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలి**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల, జూన్ 05(నేటి మన దేశమ్ ప్రతినిధి)::**ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా వెల్గటూర్ మండలం పాశిగామ, స్తంభం పెల్లి గ్రామాల్లో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసి వెను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు.వర్షాలకు కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్.డి.వో మధుసూదన్,డీ.ఎస్.వో మనోజ్ కుమార్, డి.ఎం .జితేంద్ర ప్రసాద్, తహసిల్దార్, ఎంపిడివో, ఎంపివో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలి

**తిరుమల శ్రీవారి సన్నిధిలో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి -లక్ష్మణ్**



**జగిత్యాల ,జూన్ 05(నేటి మన దేశమ్ ప్రతినిధి)**:శ్రీవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువారి జ్యోతి– లక్ష్మణ్ తెలిపారు.కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి – లక్ష్మణ్ దంపతులు సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు.శుక్రవారం తెల్లవారుజామున ఆలయ ఆవరణలో నిర్వహించిన సుప్రభాత సేవలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఆమె, అనంతరం స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, జగిత్యాల జిల్లా అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ వేద పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాలు అందించగా, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అడువాల జ్యోతి –లక్ష్మణ్ మాట్లాడుతూ, తిరుమల శ్రీవారి దర్శనం కలగడం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని, ప్రతి భక్తుడికి స్వామివారి అనుగ్రహం లభించాలని ఆకాంక్షించారు. శ్రీవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.ఈ దర్శన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందారు.

## రైతులకు నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి,జూన్ 05.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**అకాల వర్షాల కారణంగా ఈ నెల 5వ తేదీ వరకు పూర్తికావలసిన కొనుగోలు ప్రక్రియ 10వ తేదీలోగా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కామారెడ్డి డివిజన్‌లో గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 800 మెట్రిక్ టన్నుల వరి తడిసిపోవడంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి రామేశ్వర్‌పల్లి ప్యాడీ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తడిసిన వరిని వెంటనే తరలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ధాన్యం తరలింపులో జాప్యం జరగకుండా తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి తడిసిన వరిని అత్యవసరంగా రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ , జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డి సి ఓ రామ్మోహన్ రావు, సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం సిద్ధిరామేశ్వర రైస్ మిల్లులో ఆరు పారా బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.తడిసిన వరిని వెంటనే అన్‌లోడ్ చేసి స్వీకరించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి సహకారం అందించాలని సూచించారు.తమ సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని అన్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన 14 మంది రైస్ మిల్లర్ల పై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు సహకరించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రస్తుత తేదీ నాటికి జిల్లాలో మొత్తం 4,19,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి సకాలంలో తరలించేందుకు అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పెన్షన్ ప్రక్రియలో డిజిటల్ విప్లవం!

**తెలంగాణ ప్రభుత్వ ఈ పెన్షన్ సిస్టమ్ ప్రారంభం**

**పదవీ విరమణ పొందే ఉద్యోగులకు శుభవార్త!**

**టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**జగిత్యాల, జూన్ 05(నేటి మన దేశమ్ ప్రతినిధి)**::తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ మంజూరు ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు ఈ పెన్షన్ సిస్టమ్ ను పైలట్ ప్రాతిపదికన అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ తెలిపారు.

**ఆ ఉత్తర్వుల్లో ముఖ్యాంశాలు**

**ఈపిపిఓ –విధానం విజయవంతం**భౌతిక పి.పి.ఓ లకు బదులుగా ఈ –పి పి ఓ వ్యవస్థ ఇప్పటికే అమలులో ఉంది. పైలట్ శాఖల ఎంపిక ఆర్థిక శాఖ ఒ వ్యవసాయ – సహకార శాఖలను పైలట్ శాఖలుగా ఎంపిక చేశారు.

**100% ఆన్‌లైన్ ప్రాసెసింగ్** ఐఎఫ్ ఎం ఎస్ ద్వారా పెన్షన్ ప్రతిపాదనలు పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించబడతాయి.ఉద్యోగులే ఆన్‌లైన్‌లో దరఖాస్తు రిటైర్ అయ్యే ఉద్యోగులు తమ ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ లాగిన్ ద్వారా నేరుగా ప్రతిపాదనలు సమర్పించవచ్చు.

**పిఎస్ ఏ ఒ డ్ డ్ ఓ ల బాధ్యత** అన్ని పెన్షన్ ప్రతిపాదనలు ఐఎఫ్ ఎం ఎస్ పోర్టల్ ద్వారానే పరిశీలించి పంపించాలి.కాగిత రహిత విధానంలో పెన్షన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలు**

**వేగవంతమైన పెన్షన్ మంజూరు.పూర్తి పారదర్శకత** ఆన్‌లైన్ ట్రాకింగ్ సౌకర్యం కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులకు ముగింపుసమయానుకూలంగా రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపు ఉంటుందని హరి అశోక్ కుమార్ వివరించారు.

## అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు..

**-జిల్లా కలెక్టర్ కె.హరిత**



**కొమురం ఆసిఫాబాద్,జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి)::** జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు.శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

## రెబ్బెన లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం.




**కొమురం ఆసిఫాబాద్,జూన్ 05(నేటి మనదేశమ్ ప్రతినిధి)::** రెబ్బెన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దుర్గం భరద్వాజ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలన్నారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూలకండం వరలక్ష్మి వార్డు సభ్యులు అజ్మీర పరశురాం, అజ్మీర ఈశ్వర్, మంగరాజ్ గణేష్, మద్దెల వరకృష్ణ, రాపర్తి సునీత పంచాయతీ కార్యదర్శి రవీందర్ మరియు అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com